తెలంగాణ పేపర్

తెలుగు దినపత్రిక

హైదరాబాద్ సంపుటి: 13 సంచిక : 249 | సంపాదకులు : నస్రీన్ ఖాన్ | ఆదివారం, జులై 26, 2026 | పేజీలు : 8 వెల : రూ. 2/-

రేషన్ విధానంలో కేంద్రం సవరణలు: ప్రతి వ్యక్తికి 7 కిలోల బియ్యం

హైదరాబాద్ : కేంద్ర ప్రభుత్వం రేషన్ సరుకుల విధానంలో కీలక మార్పులు చేస్తోంది. జాతీయ ఆహార భద్రత చట్టం-2013 ప్రకారం,అంత్యోదయ అన్న యోజన, ఏఏవై లబ్ధిదారులకు కుటుంబ సభ్యుల సంఖ్యతో సంబంధం లేకుండా నెలకు 35 కిలోల అందించే విధానాన్ని మార్చి, ప్రతి వ్యక్తికి నెలకు 7 కిలోల చొప్పున ధాన్యం అందించాలని యోచిస్తోంది.అయితే,ఏ కుటుంబానికైనా గరిష్ట పరిమితి 35 కిలోలుగానే కొనసాగుతుంది.ఈ మార్పుల ద్వారా పెద్ద కుటుంబాలకు న్యాయం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం ఈ సవరణలను ప్రతిపాదించింది.

తెలంగాణలో ట్రాఫిక్..రోడ్డు భద్రత బ్యూరో ఏర్పాటు : సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్ : రాష్ట్రంలో ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ప్రత్యేకంగా ఒక బ్యూరోను ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రవాణా వ్యవస్థను సమగ్రంగా అధ్యయనం చేసి ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రత పర్యవేక్షణ కోసం ఏర్పాటు చేసే బ్యూరోకు సంస్థాగత నిర్మాణం ఉండాలని చెప్పారు. ముఖ్యమంత్రి తెలంగాణ ట్రాఫిక్ నిర్వహణ, రోడ్డు భద్రతపై ఎంసీఆర్ హెచ్ఆర్డీలోని బోధి పెవిలియన్‌లో ఉన్నతాధికారులతో సమీక్షించారు. ప్రతీ 2 లేదా 3 నెలలకోసారి ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించాలని ఈ సందర్భంగా అధికారులకు చెప్పారు.ట్రాఫిక్ వ్యవస్థలో నిబంధనలకన్నా క్రమబద్ధీకరణపై ఎక్కువ దృష్టి సారించాలని, వాతావరణంలో వచ్చే మార్పులు, కార్యాలయాల పనివేళలు, రద్దీ సమయాలు, స్థానిక సంస్కృతిని దృష్టిలో పెట్టుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు.కొత్తగా మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయడానికి ముందే ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు అవసరమైన అధ్యయనం జరగాలని చెప్పారు. ఔటర్ రింగ్ రోడ్డుపై ప్రమాదాలు జరగకుండా నియంత్రణ చర్యలు పటిష్టం చేయాలని, ఓఆర్ఆర్ పై ఇష్టానుసారంగా వాహనాలు నిలపకుండా నిరంతరం పర్యవేక్షణ జరగాలని ఆదేశించారు. హైదరాబాద్ నగరంలో స్మార్ట్ సిగ్నలింగ్ విధానంపై సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి చెప్పారు. సిగ్నల్ ఫ్రీ వ్యవస్థను తీసుకురావడానికి అవసరమైన చోట అండర్‌పాస్‌లు, ఎలివేటెడ్ కారిడార్‌లను నిర్మించాల్సిన అవసరం ఉందని, సాధ్యమైనంత వరకు సిగ్నళ్ల వద్ద ట్రాఫిక్ నిలిచిపోకుండా వాహనాల రాకపోకలు నిరంతరాయంగా కొనసాగేలా చూడాలని సూచించారు. ఈ సమావేశంలో ప్రభుత్వ సలహాదారులు పి.సుదర్శన్ రెడ్డి,కె.రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు,డీజీపీ సీవీ ఆనంద్ తో పాటు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

విద్యార్థులను దేశద్రోహులుగా చూస్తున్నారు: సోనియా గాంధీ



న్యూఢిల్లీ : కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ నరేంద్రమోదీ ప్రభుత్వంపై సంచలన ఆరోపణలు చేశారు. విద్యా వ్యవస్థలో చోటుచేసుకుంటున్న పరిణామాలు, విద్యార్థుల నిరసనలపై కేంద్ర ప్రభుత్వ వైఖరిని ఆమె తప్పుపట్టారు. ముఖ్యంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకపోవడాన్ని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థలో తీవ్రమైన వైఫల్యాలు వెలుగులోకి వచ్చినప్పటికీ సదరు కేంద్ర మంత్రి బాధ్యత వహించకుండా పదవిలో ఇంకా కొనసాగుతున్నారని సోనియా గాంధీ ధ్వజమెత్తారు.

ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే తలవంచాల్సిందే... ప్రధాన్ రాజీనామాపై విపక్షాలు

కాక్రోచ్ జనతా పార్టీ చేపట్టిన నిరసనల (జఙ్ఞో గ్రాతీశేవర్)తో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ (ణష్ట్రుతీఎవఅనతీఖి గ్రాతీఖిఎష్ట్రుఅ) తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ స్పందించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాను స్వాగతించారు. విద్యావ్యవస్థ పునర్నిర్మాణంలో తొలి అడుగు పడిందన్నారు. దేశవ్యాప్తంగా విద్యార్థుల పోరాటం చూసి గర్విస్తున్నట్లు పేర్కొన్నారు. వీధుల్లోకి వచ్చి పోరాడిన యువత, విద్యార్థులకు అభినందనలు తెలిపారు. మరో రెండు డిమాండ్లు మిగిలి ఉన్నాయని..వాటిని కూడా త్వరగా తీర్చాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఆందోళనకారులపై జరిగిన లాఠీఛార్జిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు.

'విద్యా వ్యవస్థను సరిదిద్దడం కోసం దేశవ్యాప్తంగా లక్షలాది మంది యువత ధైర్యంగా పోరాడారు. ప్రధాన్ రాజీనామాతో విద్యార్థులు, అవినీతి ప్రభుత్వం కారణంగా తమ పిల్లలను కోల్పోయిన కుటుంబాలు, యువత తరఫున పార్లమెంట్‌లో గళం విప్పిన ప్రతిపక్షాలు విజయం సాధించాయి' ఏ ప్రభుత్వమైనా తప్పు జరిగితే ప్రజల ముందు తలవంచాల్సిందేనన్నారు. -కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే



'యువత పోరాటం అసామాన్యం.. ఇదంతా వారి విజయం. ప్రజాస్వామ్యంలో ప్రజల ఆకాంక్షలే అంతిమం. పోరాడి సాధించిన విద్యార్థి లోకానికి శుభాకాంక్షలు' -కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ

'ఇది ప్రజాస్వామ్య విజయం. వీధుల నుంచే నేరుగా వచ్చిన ప్రత్యక్ష ప్రజాస్వామ్యం ఇది. శాంతి, సహనం, పట్టుదలకు దక్కిన విజయమిది. భయాన్ని వీడి దేశంలోని నలుమూలల నుంచి కదిలి వచ్చిన పౌరులందరికీ కృతజ్ఞతలు. కాక్రోచ్ జనతా పార్టీ నేతలకు అభినందనలు' - సోనమ్ వాంగ్‌చుక్

'కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేశారన్న వార్త ఇప్పుడే విన్నాను. ఈ రాజీనామాను నేను స్వాగతిస్తున్నాను. ఈ చర్య దేశంలోని పరిస్థితిని చక్కదిద్ది.. పార్లమెంటులోనూ, వెలుపలా మౌలిక సమస్యలపై చర్చలకు మార్గం సుగమం చేస్తుందని ఆశిస్తున్నాను'- కాంగ్రెస్ నేత చిదంబరం

'అభినందనలు.. ఎట్టకేలకు ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. విద్యార్థులు లాఠీ దెబ్బలు తిని.. గాయాలపాలయ్యారు. కొందరు 23 రోజుల పాటు నిరాహార దీక్ష చేపట్టారు. ఈ నిరసనలతోనే కేంద్రం దిగి వచ్చింది'- రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్

'ప్రజాస్వామ్యంలో జవాబుదారీతనం నుంచి తప్పించుకోలేమనే విషయాన్ని విద్యాశాఖ మంత్రి అంగీకరించారు. దేశవ్యాప్తంగా ఉన్న పౌరులు వారాల తరబడి పోరాటం చేస్తే ఇది జరిగింది. శాంతియుతంగా నిరసన తెలిపే తమ ప్రజాస్వామ్య హక్కును వినియోగించుకున్నందుకు.. ఎంతో మంది విద్యార్థులు పోలీసుల క్రూరత్వానికి, బలప్రయోగానికి గురయ్యారు. కానీ విద్యాశాఖ మంత్రి రాజీనామాతో జవాబుదారీతనం ముగిసిపోదు. మనల్ని ఈ దుస్థితికి తీసుకువచ్చిన ప్రభుత్వ వైఫల్యాలను సరిచేయడానికి ప్రభుత్వం సంస్కరణలు చేపట్టాలి. మళ్లీ ఇటువంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలి. ఈ నిరసనలు సంస్కరణలకు ఆరంభం మాత్రమే.. ముగింపు కాదు' -కాంగ్రెస్ నేత శశి థరూర్

'ఇది ప్రజాస్వామ్యానికి అలిపెద్ద విజయం. వ్యవస్థలో జరిగిన తప్పులకు వ్యతిరేకంగా పోరాడి..విజయం సాధించిన యువతకు అభినందనలు'-అరవింద్ కేజ్రీవాల్

రేవంత్ ప్రభుత్వంపై హరీశ్‌రావు తీవ్ర విమర్శలు: విద్యుత్, నీటి సరఫరాలో వైఫల్యం



హైదరాబాద్ : తెలంగాణ మాజీ మంత్రి సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. సోలిపేట విద్యుత్ సబ్‌స్టేషన్ రికార్డులు పరిశీలించిన ఆయన, గతంలో రైతులకు 14-15 గంటల విద్యుత్ అందించగా ఇప్పుడు 12 గంటలే ఇస్తున్నారని ఆరోపించారు. మిషన్ భగీరథ ద్వారా బీఆర్ఎస్ ఐదేళ్లు తాగునీరు అందించిందని, ప్రస్తుతం ఆ వ్యవస్థను కూడా ప్రభుత్వం సరిగా నిర్వహించలేక పోతోందన్నారు. మహిళలు నీటి కోసం, రైతులు ఎరువులు, విద్యుత్ కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొంటూ, రైతులకు 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు.



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా మోదీకి రాజీనామా పత్రాన్ని పంపిన ప్రధాన్

న్యూఢిల్లీ. జూలై 25: దేశవ్యాప్తంగా నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై కొనసాగుతున్న వివాదాల మధ్య కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. తన రాజీనామా పత్రాన్ని ప్రధాని నరేంద్ర మోదీకి పంపినట్లు వెల్లడించారు. పది రోజులుగా చోటుచేసుకున్న పరిణామాలు తనను తీవ్రంగా కలచివేశాయని రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ పేర్కొన్నారు. వ్యక్తిగత ప్రతిష్ఠ కోసం పదవిని కొనసాగించాలనే ఉద్దేశం తనకు లేదని, దేశ యువత ఆకాంక్షలను గౌరవిస్తూ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.నీట్ పేపర్ లీక్ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ మంత్రి పదవి నుంచి తప్పుకుంటున్నట్లు ధర్మేంద్ర ప్రధాన్ ప్రకటించారు. విద్యా వ్యవస్థపై విద్యార్థులు, తల్లిదండ్రుల్లో నెలకొన్న ఆందోళనలను దృష్టిలో ఉంచుకొని రాజీనామా చేసినట్లు వెల్లడించారు.రాజీనామా లేఖలో ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ.. నాలుగు దశాబ్దాలుగా విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్కరణల కోసం పనిచేస్తున్నానని పేర్కొన్నారు. నీట్-యూజీ పరీక్షలో అక్రమాలు వెలుగులోకి రాగానే కేంద్ర ప్రభుత్వం వెంటనే సీబీఐ దర్యాప్తునకు ఆదేశించిందని, పరీక్షను రద్దు చేసి రీ-ఎగ్జామ్ నిర్వహించిందని గుర్తు చేశారు. వచ్చే ఏడాది నుంచి కంప్యూటర్ ఆధారిత విధానంలో పరీక్ష నిర్వహించాలని నిర్ణయించినట్లు తెలిపారు.20 లక్షల మందికి పైగా విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని పరీక్షలను విజయవంతంగా నిర్వహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేశాయని ప్రధాన్ చెప్పారు. పరీక్షా మాఫియా వల్ల ఒక్క ప్రతిభావంతుడికీ అన్యాయం జరగకూడదన్న ఉద్దేశంతో మొదటి రోజు నుంచే తాను బాధ్యత తీసుకున్నానని తెలిపారు. అయితే రీ-ఎగ్జామ్ ఫలితాల సమయంలో కొందరు బాధ్యతాయుత స్థానాల్లో ఉన్న వ్యక్తులు విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేయడం తనను తీవ్రంగా కలిచివేసిందని పేర్కొన్నారు.గత పది రోజులుగా జరిగిన పరిణామాలు తనను తీవ్రంగా బాధించాయని, ఇది వ్యక్తిగత ప్రతిష్ఠకు సంబంధించిన విషయం కాదని ప్రధాన్ స్పష్టం చేశారు. జంతర్‌మంతర్‌తో పాటు దేశవ్యాప్తంగా నెలకొన్న పరిస్థితులను దృష్టిలో పెట్టుకొని, దేశ వ్యతిరేక శక్తులు ఈ అంశాన్ని ఉపయోగించుకోకుండా ఉండేందుకు, విద్యార్థుల భవిష్యత్తు న్యాయపరమైన చిక్కుల్లో పడకుండా కాపాడేందుకు, వారు చదువుపై దృష్టి పెట్టేలా చేయడానికే తాను రాజీనామా చేసినట్లు వెల్లడించారు. ప్రధాని మోదీ తనపై ఉంచిన నమ్మకానికి కృతజ్ఞతలు తెలిపిన ఆయన, ప్రజాసేవను ఇకముందు కూడా కొనసాగిస్తానని పేర్కొన్నారు.కొందరు నిరుద్యోగులను ఉద్దేశించి సీజేఐ చేసిన వ్యాఖ్యలతో పుట్టిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ).. నీట్ పేపర్ లీక్, విద్యావ్యవస్థలో అవకతవకలపై 2026 జూన్ నుంచి ఉద్యమం మొదలుపెట్టింది. సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల నిరాహార దీక్షతో ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసింది. ఢిల్లీలోని జంతర్‌మంత్ వేదికగా సాగిన ఈ పోరు అనతి కాలంలో అనూహ్య ఆదరణను సొంతం చేసుకుంది. జులై 20న పార్లమెంట్ ముట్టడి లక్ష్యంగా తలపెట్టిన 'చలో సంసద్' కార్యక్రమంతో ఉద్యమం మరో స్థాయికి చేరింది. పోలీసుల లాఠీఛార్జి, వాంగ్‌చుక్‌ను బలవంతంగా ఆసుపత్రికి తరలించడం వంటి పరిణామాలతో దేశవ్యాప్తంగా యువత, ప్రముఖులు తమ గొంతుకను వినిపించారు.దీంతో దిగొచ్చిన కేంద్రం విద్యార్థులతో చర్చలు ప్రారంభించింది. స్వయంగా ప్రధాని ఉద్యమాన్ని చల్లార్చేందుకు ప్రకటనలు చేశారు. నీట్ పేపర్ లీక్‌కు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. పేపర్ లీక్ కేసులను వేగంగా విచారించేందుకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. అలాగే సంబంధిత చట్టాలను సైతం కఠినతరం చేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో విద్యార్థులతో శుక్రవారం రెండు దఫాలు చర్చలు జరిపారు.ఈ సందర్భంగా ప్రభుత్వం ముందు మూడు ప్రధాన డిమాండ్లను ఉంచారు. వాటిలో నీట్ పేపర్ లీక్ వల్ల చనిపోయిన విద్యార్థుల కుటుంబాలకు పరిహారం, నిరసన చేపట్టిన విద్యార్థులపై చట్టపరమైన చర్యలు తీసుకోబోమని హామీ వంటి వాటికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. దీంతో వాంగ్‌చుక్ సైతం తన దీక్షను విరమించారు. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విషయంలో మాత్రం సంశయించింది. కానీ, విద్యార్థులు ఆ విషయంలో వెనక్కి తగ్గేది లేదని తేల్చి చెప్పడంతో మంత్రి రాజీనామా చేయక తప్పలేదు. అంతకు ముందు నీట్ ప్రశ్నపత్రం లీక్ వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వంతో కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) తన వైఖరిని మరింత కఠినతరం చేసింది. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం లేదా ఆయన్ను పదవి నుంచి తొలగించడం తప్ప మరో పరిష్కారం తమకు ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేసింది..శుక్రవారం కేంద్ర మంత్రులు జేపీ నడ్డా, జితేంద్ర సింగ్‌లతో జరిగిన రెండో విడత చర్చల్లో మూడు ప్రధాన డిమాండ్లు, పరీక్షల సంస్కరణలకు సంబంధించిన ఐదు సూచనలను సీజేపీ ప్రతినిధులు ప్రభుత్వానికి వివరించారు. విద్యార్థులపై నమోదైన కేసులను ఉపసంహరించుకోవడం, ఆత్మహత్య చేసుకున్న నీట్ అభ్యర్థుల కుటుంబాలకు పరిహారం ఇవ్వడంపై కేంద్రం సూత్రప్రాయంగా అంగీకరించింది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా అంశంపై మాత్రం నిర్ణయం తీసుకోలేదు. దీనిపై ప్రభుత్వంతో చర్చించి శనివారం తుది సమాధానం ఇస్తామని మంత్రులు తెలిపారు.అయితే విద్యాశాఖ మంత్రి రాజీనామా చేసే ప్రసక్తే లేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. మంత్రి వెనుక ప్రభుత్వం పూర్తిగా నిలబడిందని, రాజీనామా సమస్యకు పరిష్కారం కాదని పేర్కొంటున్నాయి. ఇదే సమయంలో పేపర్ లీక్‌లపై వేగంగా విచారణ పూర్తిచేసేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించారు. అలాగే పేపర్ లీక్ నిరోధక చట్టాన్ని మరింత కఠినతరం చేసేందుకు సవరణలు తీసుకురావాలని కేంద్రం నిర్ణయించింది.ఇక ఎన్‌టీఏలో 47 మంది అధికారులను తొలగించడం, విద్యాశాఖ కార్యదర్శిని మార్చడం వంటి చర్యలు తీసుకున్నప్పటికీ, అవి సరిపోవని సీజేపీ పేర్కొంది. పేపర్ లీక్‌లకు, వాటి కారణంగా విద్యార్థులు ఎదుర్కొన్న విషాదాలకు రాజకీయ బాధ్యత విద్యాశాఖ మంత్రిదేనని, అందుకే ఆయన పదవికి రాజీనామా చేయాల్సిందేనని అశుతోష్ రాంకా మరోసారి స్పష్టం చేశారు. శనివారం జరిగే మూడో విడత చర్చల్లో ఈ అంశమే కీలకంగా మారనుంది.

లాబీయింగ్ చేసుకున్నారా

సోషల్ యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్ 26 రోజుల దీక్ష తర్వాత విరమణ చేయడంతో చాలామంది ఊపిరిపీల్చుకున్నారు. ప్రాణాపాయం నుంచి బయటపడి.. ఇప్పుడిప్పుడే కోలుకుంటున్న సోనం వాంగ్‌చుక్‌పై ట్రోలింగ్ మొదలైంది. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండా దీక్ష ఎలా విరమిస్తారంటూ సోషల్ మీడియాలో ట్రోలింగ్ మొదలుపెట్టారు కొందరు. ఆయన పర్సనల్ డీల్ సెట్ చేసుకున్నారంటూ మండిపడుతున్నారు

నీట్ లీక్స్, ఆతర్వాత 21 మంది విద్యార్థుల మృతిపై కాక్రోచ్ జనతా పార్టీ రెండు నెలలుగా జంతర్ మంతర్ దగ్గర ధర్నాకు దిగింది. అయితే వారికి మద్దతుగా నిలిచిన సోషల్ యాక్టివిస్ట్ సోనమ్ వాంగ్‌చుక్.. ఆమరణ దీక్షకు దిగుతున్నానని ప్రకటించారు. సరిగ్గా 21 రోజుల తర్వాత ఆయనను బలవంతంగా ఆస్పత్రికి తరలించారు పోలీసులు. ఆ తర్వాత కూడా దీక్షను కొనసాగించారు. మరోవైపు సీజేపీ తోపాటు.. సోనం వాంగ్‌చుక్ అడుగుతున్న డిమాండ్లలో రెండింటికి కేంద్రం ఒప్పుకుంది. ఒక్కటి మాత్రం పదిలేసింది. అదే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా. ఈ విషయంలో అప్పటివరకు గట్టిగా పట్టుబట్టిన సోనం వాంగ్‌చుక్.. మెత్తబడ్డారు. మిగిలిన డిమాండ్లకు కేంద్రం ఒకే చెప్పడంతో 26 రోజుల దీక్షను ముగించారు.

తెలంగాణ పవర్

సంపాదకీయం

ఆదివారం, జులై 26, 2026

విద్యావ్యవస్థలో సంస్కరణలు అవసరం

"ఒక దేశ నాశనానికి అణుబాంబులు కానీ, సుదూర క్షిపణులు కానీ అవసరం లేదు. విద్యా వ్యవస్థ ప్రమాణాలను తగ్గించి, విద్యార్థులను పరీక్షల్లో మోసం చేయడానికి అనుమతిస్తే చాలు.. ఆ దేశం తనంతట తానే కూలిపోతుంది."దక్షిణాఫ్రికాలోని ఒక ప్రముఖ విశ్వవిద్యాలయ ప్రవేశ ద్వారం వద్ద పెద్ద అక్షరాలతో ఈ సత్యం రాసి ఉంటారు. సరిగ్గా ఈ కొటేషన్ మన దేశంలో నేడు చోటుచేసుకుంటున్న పరంపరలకు అద్దం పడుతోంది. దొరికినవాడే దొంగ.. దొరకనంత వరకు అందరూ దొరలే అన్నట్లుగా తయారైంది మన దేశంలోని పోటీ పరీక్షల తీరు. నీట్ ప్రవేశ పరీక్ష పేపర్ లీకేజీ ఉదంతం దేశవ్యాప్తంగా లక్షల మంది విద్యార్థులలో, వారి తల్లిదండ్రులలో సృష్టించిన ఆగ్రహజ్వాలలు ఇంకా చల్లారలేదు. ప్రశ్నాపత్రం లీక్ అయిందని ఆధారాలతో సహా రుజువు కావడంతో దిద్దుబాటు చర్యల్లో భాగంగా కేంద్ర ప్రభుత్వం పరీక్షను రద్దు చేసి, తీవ్ర నిరసనల మధ్య మళ్లీ నిర్వహించింది. అంతవరకు బాగానే ఉంది. కానీ, ఇక్కడ అసలైన ప్రశ్న ఏమిటంటే ఈసారి దొరికింది కాబట్టి లీకేజీ బయటపడింది; మరి దొరకకుండా వెనుక తలకాయలు నడిపిన ముఠాలు, గతంలో జరిగిన పరీక్షల్లో ఎంతటి అక్రమాలకు పాల్పడి ఉంటాయి? భవిష్యత్తులో ఇవి మళ్లీ జరగవని గ్యారెంటీ ఏమిటి?మన విద్యా వ్యవస్థలో పేపర్ లీకేజీలు అనేవి ఒక సాధారణ రుగ్మత గా మారిపోవడం సమగ్ర ప్రజాస్వామ్యానికే పెను ప్రమాద ఘంటిక. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ నిర్వహించిన అత్యున్నత వైద్య విద్యా ప్రవేశ పరీక్ష నీట్ లో చోటుచేసుకున్న అవకతవకలు బయటపడటంతో కేంద్ర ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొంటోంది. కేసు విచారణను సిబిఐ కి అప్పగించడం, దర్యాప్తు సంస్థలు బీహార్, గుజరాత్ సహా పలు రాష్ట్రాల్లో నిందితులను అరెస్ట్ చేయడం, ముఠాల గుట్టు రట్టు చేయడం చరచరా జరిగాయి. హైటెక్ పద్ధతుల్లో వాట్సాప్ గ్రూపులు, సేఫ్ హౌస్‌లలో విద్యార్థులకు సమాధానాలు బట్టీ పట్టించడం వంటి ఘోరాలు వెలుగు చూశాయి. దేశంలో యువతరం రోడ్లపైకి వచ్చింది. లీకేజీల వ్యవస్థపై అసహనం శృతిమించి కాక్రోచ్ పేరుతో సరికొత్త నిరసన ఉద్యమాలు రూపుదిద్దుకున్నాయి. లీకేజీలు, వ్యవస్థాగత లోపాల వల్ల తమ భవిష్యత్తు చీకటిమయమవుతోందన్న ఆవేదన, ఆగ్రహం యువతలో ఏ స్థాయిలో ఉందో ఈ నిరసనల ఉద్ధృతి స్పష్టం చేస్తోంది.మన దేశ పారదర్శకతకు పేపర్ లీకేజీలు కొత్తేమీ కావు. దశాబ్దాల చరిత్రను తిరగేస్తే, ప్రతిష్టాత్మక కేంద్ర, రాష్ట్ర స్థాయి పరీక్షల్లో ఎన్నో సార్లు లీకేజీ ఘటనలు వెలుగు చూశాయి. బయటపడి, రగడ తీవ్రమైనప్పుడు మాత్రమే ప్రభుత్వాలు రద్దు నిర్ణయాలు తీసుకున్నాయి. సమాజం దృష్టికి రాని, ఆధారాలు దొరకని ఎన్నో సందర్భాల్లో అక్రమార్కులు అత్యున్నత ర్యాంకులు పొంది వ్యవస్థలోకి ప్రవేశించి ఉంటారనడంలో ఎలాంటి సందేహమూ లేదు. దీనివల్ల రాత్రింబవళ్లు కష్టపడి చదివిన నిజమైన ప్రతిభావంతులు, నిరుపేద విద్యార్థులు శాశ్వతంగా తమ అవకాశాలను కోల్పోయారు. గతంలో జరిగిన నష్టాన్ని ఇప్పుడు పునరుద్ధరించలేకపోవచ్చు, కానీ భవిష్యత్తు తరాల భవితవ్యాన్ని రక్షించడానికి శాశ్వత, కఠిన కట్టడి చర్యలు వంద శాతం అవసరం. ఎప్పటికప్పుడు తాత్కాలిక ఉపశమానాలు లేదా చిన్నచిన్న కమిటీలతో సరిపెడుతున్న పాలకులు, ఈ వ్యవస్థాగత చీడను తుడిచిపెట్టే శాశ్వత పరిష్కారాల వైపు అడుగులు వేయకపోవడమే అసలు విషాదం. పేపర్ లీకేజీల మహమ్మారి కేంద్ర పరిధిలోని పరీక్షలకే పరిమితం కాలేదు. తెలుగు రాష్ట్రాల్లో వైఫల్యాలు అనేకమంది అభ్యర్థుల జీవితాలను బుగ్గిపాలు చేశాయి. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి ఎంసెట్ లీకేజీలు పదే పదే కలకలం రేపాయి. ముఖ్యంగా 2016 లో తెలంగాణలో జరిగిన ఎంసెట్-2 మెడికల్ పేపర్ లీకేజీ ఘటన దేశాన్నే‌ ఉలిక్కిపాటికి గురిచేసింది. ఆల్ ఇండియా స్థాయిలో నెట్‌వర్క్ నడిపి, కోట్ల రూపాయలు వసూలు చేసి ప్రింటింగ్ ప్రెస్ స్థాయి నుంచే పేపర్ లీక్ చేశారు. దీంతో లక్షలాది మంది విద్యార్థులు మళ్లీ పరీక్ష రాయాల్సి వచ్చింది. హైదరాబాద్ కేంద్రంగా రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ కార్యాలయంలోనే కంప్యూటర్లు హ్యాక్ చేసి, అంతర్గత సిబ్బంది ద్వారా గ్రూప్-1 ప్రిలిమ్స్, అసిస్టెంట్ ఇంజనీర్ పరీక్షల పేపర్లు లీక్ కావడం అత్యంత భయంకరమైన ఉదంతం. ఏళ్ల తరబడి కోచింగ్ సెంటర్లలో మగ్గిపోయిన నిరుద్యోగ యువత రోడ్లెక్కి ఉద్యమించాల్సి వచ్చింది. ఈ లీకేజీల ఫలితంగా పదే పదే పరీక్షలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాల్సిన దుస్థితి ఏర్పడింది. తరచూ టెన్త్ క్లాస్ బోర్డు పరీక్షల ప్రశ్నాపత్రాలు పరీక్ష ప్రారంభమైన కొద్ది నిమిషాల్లోనే వాట్సాప్ గ్రూపుల్లో ప్రత్యక్షం కావడం, ఉపాధ్యాయులు, కార్పొరేట్ విద్యాసంస్థల ప్రతినిధులు అరెస్ట్ కావడం మనం చూస్తూనే ఉన్నాం. మరోవైపు, ఒకే దేశం ? ఒకే పరీక్ష అనే అతిగా కేంద్రీకృతమైన నినాదం కూడా తీవ్రమైన సమస్యలను తెచ్చిపెడుతోంది. భారత్ లాంటి విభిన్నమైన, విశాలమైన దేశంలో కోట్లాది మందికి ఒకే ఏజెన్సీ ద్వారా ప్రవేశ పరీక్షలను నిర్వహించాలనుకోవడం పరిపాలనావరంగా అత్యంత ప్రమాదకరమైన ప్రయోగం. దేశంలో ఎక్కడో ఒక మూలన ఉన్న పరీక్షా కేంద్రంలో చిన్న లోపం జరిగినా, లేదా ఒక డిజిటల్ నెట్‌వర్క్ హ్యాక్ అయి పేపర్ బయటకు వచ్చినా.. దేశవ్యాప్తంగా ఉన్న 20 నుండి 25 లక్షల మంది విద్యార్థుల శ్రమ బూడిదలో పోసిన పన్నీరవుతుంది. అంతేకాకుండా, రాష్ట్రాల విద్యా బోర్డుల స్వయంప్రతిపత్తి దెబ్బతిని, ప్రాంతీయ వ్యత్యాసాలు ఉన్న విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది.ప్రజాస్వామ్యంలో నిరసన అనేది రాజ్యాంగం కల్పించిన హక్కు. అది ప్రభుత్వాల కళ్లు తెరిపించడానికి, వ్యవస్థాగత సంస్కరణలు సాధించడానికి ఉపయోగపడాలి. కానీ, ఆ నిరసనలు ప్రజా ఆస్తుల విధ్వంసానికి, హింసకు దారితీస్తే అది అరాచకత్వానికి దారితీసి, అసలు ఆశయానికే విఘాతం కలిగిస్తుంది.ప్రస్తుతం యువత జరుపుతున్న కాక్రోచ్ ఆందోళనలను , నీట్ నిరసనలను ప్రతిపక్షాలు ప్రత్యేకించి కాంగ్రెస్ వంటి పార్టీలు పూర్తిగా తమ రాజకీయ లబ్ధి కోసం హైజాక్ చేయడానికి ప్రయత్నిస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి.

- ఎడిటర్

సేవతో పుట్టినరోజు వేడుక..

- రోగులకు పండ్లు.. ప్రకృతికి మొక్కలు..
- స్ఫూర్తిగా నిలిచిన జర్నలిస్ట్ లాయక్ పాషా



వేములవాడ, జూలై 25: జన్మదినాన్ని కేవలం వేడుకగా కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా దినోత్సవంగా నిర్వహిస్తూ తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) రాష్ట్ర ఉపాధ్యక్షులు, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు సయ్యద్ లాయక్ పాషా ఆదర్శంగా నిలిచారు.

జన్మదినం సందర్భంగా వేములవాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులకు పండ్లు, బ్రెడ్ పంపిణీ చేసి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం జర్నలిస్టు కాలనీలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ తమ జన్మదినం సందర్భంగా కనీసం ఒక మొక్కను నాటి సంరక్షించాలని పిలుపునిచ్చారు.

తర్వాత అగ్రహారంలోని 'శ్రీ' కన్వెన్షన్‌లో సహచర జర్నలిస్టులు, స్నేహితుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన వేడుకలు నిర్వహించారు. వ్యక్తిగత వేడుకల కంటే సేవా కార్యక్రమాలే గొప్పవని, సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలతో ప్రత్యేక రోజులను జరుపుకోవాలని లాయక్ పాషా పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో వేములవాడ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు కొలిపాక నరసయ్య, ప్రధాన కార్యదర్శి సయ్యద్ అలీ, సీనియర్ పాత్రికేయులు తాహర్ పాషా, రేగుల రాంప్రసాద్, కార్యవర్గ సభ్యులు, పలువురు జర్నలిస్టులు పాల్గొని లాయక్ పాషాకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

మంథని గురుకుల పాఠశాలలో డెటాల్ తాగిన ఇద్దరు విద్యార్థులు

ప్రజాసంఘాల పరామర్శ

పెద్దపల్లి జిల్లా మంథని సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల హాస్టల్ లో ఇద్దరు విద్యార్థులు అనుమానాస్పద స్థితిలో డెటాల్ తాగి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే వారిని స్థానిక ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ఈ విషయం తెలుసుకున్న ప్రజాసంఘాల నాయకులు ఆసుపత్రికి చేరుకొని విద్యార్థులను పరామర్శించారు. సెలైన్ పెట్టి చికిత్స చేస్తున్న విద్యార్థులకు వారి కుటుంబ సభ్యులకు ధైర్యం తెలియచేసారు. విద్యార్థులు ఏ కారణాల వల్ల డెటాల్ తాగారో తెలియాల్సి ఉండగా విద్యార్థులు మంథని ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతు ఉండగా సంబంధిత హౌస్ మాస్టర్ మరియు హెల్త్ సూపర్వైజర్ యాజమాన్యం మరియు సంబంధిత హాస్టల్ ప్రిన్సిపాల్ ఇతర టీచర్లు ఉన్నత స్థాయి అధికారులతో జూమ్ మీటింగ్ లో ఉన్నామని చెప్పడం పట్ల ప్రజా సంఘాల నాయకులు అగ్రహం వ్యక్తం చేసారు. మంథని గురుకుల హాస్టల్ లో గతంలో ఇలాంటి సంఘటనలు చాలా జరిగాయని, ఇంకా ఇలాంటి ఘటనలు తిరిగి పునరావృతం కాకుండా ఉండాలని హెచ్చరించారు. పరామర్శించిన ప్రజాసంఘాల నాయకులు మాట్లాడుతూ, గురుకులాల్లో విద్యార్థుల భద్రత, ఆహారం, వసతులపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు. విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఆర్ల సందీప్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బూడిద గణేష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు గొర్రెంకల సురేష్, కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మంథని లింగయ్య, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బండెల రాజకుమార్ పాల్గొన్నారు.



కళల కాణాచి భారత దేశం

- భారత పూర్వ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు
- శిల్పకళావేదికలో అంతర్జాతీయ శాస్త్రీయ సంగీత నృత్య సదస్సు ప్రారంభం
- అద్భుతం స్వాతి సోమనాథ్ బృందం కామసూత్ర నృత్య నాటకం
ఘనంగా - నల్లాన్ చక్రవర్తుల మూర్తి, అలేఖ్య పుంజాల, కౌశికి చక్రవర్తి లకు విపంచి జీవన సాఫల్య పురస్కారాల ప్రదానం





భారత శాస్త్రీయ సంగీత నృత్య కళలే ప్రపంచానికి ఆదర్శనీయంగా ఆకర్షిస్తున్నాయని, భారత దేశం కళల కాణాచి అని భారత పూర్వ రాష్ట్రపతి ఎం. వెంకయ్య నాయుడు అన్నారు. భారతీయ మూలాలు మరచిపోకుండా సాంస్కృతిక వైభవాన్ని భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. శనివారం శిల్పకళావేదికలో విపంచి సంస్థ పదవ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా అంతర్జాతీయ భారతీయ శాస్త్రీయ సంగీత నృత్య సదస్సు ప్రారంభమైంది. రెండు రోజుల పాటు జరిగే ఈ సదస్సును ముఖ్య అతిథి ఎం.వెంకయ్య నాయుడు జ్యోతి ప్రకాశనం చేసి ప్రారంభించారు. దివంగత గాయని ఎస్. జానకి చిత్ర పటానికి పూలమాల సమర్పించి నివాళులు అర్పించారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాలు పరిరక్షిస్తూ పరివ్యాప్తి చేస్తున్న విపంచి సంస్థను ఆయన అభినందించారు. భారతీయ కళలు కేవలం మానసిక ఉల్లాసాన్ని స్వాంతనను మాత్రమే కాకుండా విజ్ఞానాన్ని విలువలు సంస్కృతి సంప్రదాయాలను నేర్పిస్తాయని, గురు పరంపర కొనసాగిస్తూ పిల్లలకు కుటుంబ వ్యవస్థ పట్ల గౌరవం పెంపొందించాలని కోరారు. భారత దేశం ఒకప్పుడు ప్రపంచానికి విశ్వ గురువు అని, బ్రిటిష్ వారి దండయాత్ర తరువాత మన మూలాలు సంస్కృతి మరచిపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. హిందూ అంటే మతం కాదని, అది భారతీయ జీవన విధానమని, కానీ నేటి రాజకీయం ఆ అర్థాన్నే మార్చేసిందని ఆందోళన వ్యక్తం చేశారు. కళల పట్ల అభిరుచి పెంపొందించుకుని లోతైన అధ్యయనం చేసి సమాజానికి అందించాలని కోరారు. విశిష్ట అతిథిగా విచ్చేసిన ఒరిస్సా గవర్నర్ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ భారతీయ సంస్కృతి సంప్రదాయాలు తరతరాలుగా కొనసాగుతున్నాయని, యువతకు సరైన దిశా నిర్దేశం చేయాల్సిన అవసరం ఉందన్నారు. కళా వికాసంతో సమాజభివృద్ధి జరుగుతుందని శాంతి సౌభాగ్యం వెల్లివిరుస్తుందని, సాంస్కృతిక వైభవం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. విపంచి పదేళ్ల ప్రస్థానం ప్రత్యేక సంచికను ఆవిష్కరించారు. సభాధ్యక్షత వహించిన విపంచి అధ్యక్షులు, మహీంద్రా యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ రాజారావు త్రిపురనేని మాట్లాడుతూ భారతీయ కళా శక్తి మహత్తరం అని, సంగీత నృత్య మధురిమల గురించి చర్చించి యువతకు సరికొత్త స్ఫూర్తిని అందించేందుకు అంతర్జాతీయ స్థాయిలో సదస్సు ఏర్పాటు చేశామని, తొలి రోజు సదస్సును గాయని ఎస్.జానకికి అంకితం చేసినట్లు తెలిపారు. మహారాష్ట్ర తెలుగు సంఘం చైర్మన్ పుచ్చా వెంకటరమణ, కాట్రగడ్డ రాజగోపాలరావు, కాంటినెంటల్ కాఫీ ఎండి చల్లా రాజేంద్రప్రసాద్, కేంద్ర సంగీత నాటక అకాడమీ సభ్యురాలు డా. ఎస్. పి. భారతి, డా. శైలజ దేశాయ్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గవర్నర్ కె. హరిబాబును తెలుగు వెలుగులు పురస్కారంతో సన్మానించారు. కర్ణాటక సంగీత కళానిధి డాక్టర్ నల్లాన్ చక్రవర్తుల మూర్తి, ప్రఖ్యాత హిందూస్థాని శాస్త్రీయ గాయని డాక్టర్ కౌశికి చక్రవర్తి, ప్రముఖ కూచిపూడి నర్తకీమణి ప్రొఫెసర్ డాక్టర్ అలేఖ్య పుంజాల లను విపంచి జీవన సాఫల్య పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. సంగీత నృత్య అభినయ ఉపన్యాస సదస్సులో సెంట్రల్ యూనివర్సిటీ ఇంచార్జ్ వైస్ ఛాన్సలర్ ఆచార్య డాక్టర్ అనూరాధ జొన్నలగడ్డ, సితార విద్వాంసురాలు డాక్టర్ అనుపమ భగవత్, సంగీత దర్శకులు డాక్టర్ వైజర్సు బాలసుబ్రహ్మణ్యం, పద్మశ్రీ దీపికారెడ్డి, డాక్టర్ కళాకృష్ణ, డాక్టర్ అయ్యగారి శ్యామ సుందర్, వయోలిన్ డాక్టర్ అశోక్ గుర్జాలే, డాక్టర్ రాఘవాచారి, డాక్టర్ రాజ్యలక్ష్మి సేథ్, డాక్టర్ రమాప్రభ యర్రమిల్లి తదితర ప్రముఖులు పాల్గొని వివిధ సంగీత నృత్య అంశాలపై మాట్లాడారు. కళాపోషకులు మండవ ఆశాప్రియ, పద్మప్రియ కాసరనేని, లయన్ టి.పద్మావతి పాల్గొన్నారు.

తొలిరోజు సదస్సులో 'కామసూత్ర' నృత్య నాటకం ప్రత్యేకంగా ఆకట్టుకుంది.

ప్రముఖ నాట్య గురు డాక్టర్ స్వాతి సోమనాథ్ (శ్రీకాకుళం) "సంప్రదాయం" శిష్య బృందం రచయిత బ్నిమ్ రచించిన కామసూత్ర నృత్య రూపకం అద్భుతంగా ప్రదర్శించారు. కాట్రగడ్డ హిమాన్షి, పద్మప్రియ అశాప్రియ నృత్య ప్రదర్శనలు, బెంగళూరుకు చెందిన అనుపమ భగవత్ సితార్ నాదం, పద్మజా విశ్వాస్ బృందం జానపద సంగీత ప్రదర్శనలు అలరించాయి. డాక్టర్ గాయత్రి రావు వ్యాఖ్యాతగా వ్యవహరించగా, విపంచి అధ్యక్షులు ప్రొఫెసర్ డాక్టర్ రాజారావు త్రిపురనేని పర్యవేక్షించారు.

రాజాసింగ్ కు దారేదీ...



హైదరాబాద్, జూలై 25, (న్యూస పల్స్) తెలంగాణ రాజకీయాల్లో కరడుగట్టిన హిందూత్వ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన గోషామహల్ ఎమ్మెల్యే టి. రాజాసింగ్ భవిష్యత్తు ఇప్పుడు సస్పెన్స్‌లో ఉంది. గతంలో రాష్ట్ర నాయకత్వ ఎంపికతో పాటు పలు అంశాలపై తీవ్ర అసంతృప్తి చెంది ఆవేశంతో బీజేపీకి రాజీనామా చేసిన రాజాసింగ్‌కు, క్రమశిక్షణే ప్రాతిపదికగా పనిచేసే కమలం పార్టీ అధిష్ఠానం షాక్ ఇచ్చింది. ఆయన రాజీనామాను ఆమోదిస్తూ కేంద్ర నాయకత్వం నిర్ణయం తీసుకోవడం, ఆయన లేవనెత్తిన అంశాలు అసంబద్ధమైనవి అని తేల్చిచెప్పడం తెలంగాణ బీజేపీలో ఆయన శకం ముగిసిందనే సంకేతాలను స్పష్టంగా పంపింది.రాజీనామా చేసిన తొలినాళ్లలో దూకుడు ప్రదర్శించిన రాజాసింగ్‌కు, ఆ తర్వాతి పరిణామాలతో బీజేపీని వీడడం ఎంతటి ప్రతికూల నిర్ణయమో బోధపడింది. తనకున్న హిందూత్వ రాజకీయ ఐడెంటిటీ బీజేపీతోనే ముడిపడి ఉందనే సత్యాన్ని గ్రహించిన ఆయన, మళ్లీ పార్టీలోకి చేరేందుకు రకరకాల మార్గాల్లో తీవ్రమైన లాబీయింగ్ ప్రారంభించారు. కేంద్ర పెద్దలకు విజ్ఞప్తులు పంపడం, అధిష్ఠానం దృష్టిని ఆకర్షించేందుకు ప్రయత్నించడం వంటివి చేశారు. అయితే, ఎప్పటికప్పుడు అధిష్ఠానానికి, రాష్ట్ర నాయకత్వానికి ఎదురు తిరిగి శ్రుతిమించిన వ్యాఖ్యలు చేసే రాజాసింగ్‌ను మళ్లీ వెనక్కి తీసుకునేందుకు బీజేపీ జాతీయ నాయకత్వం ఏమాత్రం సుముఖంగా లేదని స్పష్టమవుతోంది.ఇదే సమయంలో, బీజేపీ తనను పట్టించుకోకపోవడంతో తీవ్ర నిరాశకు గురైన రాజాసింగ్.. తన అసహనాన్ని శాపనార్థాల రూపంలో వెళ్లగక్కుతున్నారు. రాష్ట్రంలో బీజేపీ బాగుపడదని, పార్టీని నాశనం చేస్తున్నారని విమర్శిస్తూనే మరోవైపు లోపాయికారీగా మళ్లీ ప్రవేశం కోసం ప్రయత్నాలు ముమ్మరం చేస్తున్నారు. తెలంగాణలో గోషామహల్ నియోజకవర్గం మినహా రాష్ట్రవ్యాప్తంగా సొంత బలం మీద ఓట్లను ప్రభావితం చేసే స్థాయిలో రాజాసింగ్‌కు వ్యక్తిగత ఓటు బ్యాంక్, పార్టీ కేడర్ మద్దతు లేకపోవడం ఆయనకున్న అతిపెద్ద బలహీనత. ఇక్కడ ఆయనకు మరో ప్రాంతీయ పార్టీలో చేరే అవకాశం కూడా లేదు. ఈ క్రమంలోనే రాజాసింగ్ తన రాజకీయ దృష్టిని తెలంగాణ దాటి ఇతర రాష్ట్రాల వైపు మళ్లిస్తున్నట్లు రాజకీయ భావిస్తున్నారు. నేను తెలంగాణలో రాజకీయాలు చేయకపోయినా.. దేశంలో హిందూత్వ కోసం పనిచేస్తాను అని చెబుతున్నారు. తెలంగాణలో కంటే రాజాసింగ్‌కు పొరుగున ఉన్న మహారాష్ట్ర, ఉత్తరప్రదే వంటి ఉత్తరాది రాష్ట్రాల్లోని హిందూత్వ వర్గాల్లో విస్తృతమైన పాపులారిటీ, క్రియాశీల ఫాలోయింగ్ ఉంది. సకల్ హిందూ సమాజ్ నిర్వహించే పలు సభల్లో ఆయన ప్రసంగాలకు అక్కడి తీవ్ర హిందూత్వ వర్గాల నుంచి పెద్ద ఎత్తున మద్దతు లభించింది. ముఖ్యంగా ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌తో రాజాసింగ్‌కు అత్యంత సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పలు వేదికలపై యోగి సిద్ధాంతాలను, బుల్డోజర్ మార్క్ పాలనను రాజాసింగ్ బహిరంగంగానే కొనియాడారు. యోగి అండదండలతో ఉత్తరప్రదేశ్‌లో గానీ, లేదా తన భావజాలానికి అనుకూలంగా ఉండే మహారాష్ట్ర సరిహద్దు ప్రాంతాల్లో గానీ బీజేపీ తరపున ఒకవేళ అధిష్ఠానం కరుణిస్తే లేదా హిందూత్వ సంస్థల మద్దతుతో కొత్త రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభించినా ఆశ్చర్యపోనవసరం లేదు.ఆవేశంలో తీసుకున్న నిర్ణయం వల్ల సొంత నియోజకవర్గమైన గోషామహల్‌కే పరిమితమైన రాజాసింగ్ పరిస్థితి ప్రస్తుతం త్రిశంకు స్వర్గాన్ని తలపిస్తోంది. తెలంగాణలో తలుపులు మూసుకుపోవడంతో, తన రాజకీయ ఉనికిని కాపాడుకోవడానికి యూపీ, మహారాష్ట్రల రూపంలో ఆయనకు లభించే జాతీయ హిందూత్వ ఇమేజే ఏకైక శరణ్యంగా కనిపిస్తోంది. మరి యోగి ఆదిత్యనాథ్ మద్దతుతో రాజాసింగ్ జాతీయ రాజకీయ వేదికపై రీ-ఎంట్రీ ఇస్తారో లేక తెలంగాణ రాజకీయాల్లోనే మరో కొత్త వ్యూహంతో ముందుకు వస్తారో వేచి చూడాలి.

బీఆర్ఎస్ డబుల్ బెడ్ రూమ్...

హైదరాబాద్, జూలై 25, (న్యూస పల్స్)హైదరాబాద్ మహానగరంలో సొంతింటి కోసం దశాబ్దాలుగా నిరీక్షిస్తున్న పేద, దిగువ మధ్యతరగతి ప్రజలను మరోసారి రాజకీయ లబ్ధి కోసం వాడుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పక్కా స్కెచ్ వేసింది. నగర నడిబొడ్డున ఇందిరమ్మ టవర్స్ పేరుతో రూ. 40 నుంచి రూ. 60 లక్షల విలువైన ఫ్లాట్లను కేవలం రూ. 6 లక్షలకే ఇస్తామంటూ సరికొత్త సెంటిమెంట్ రగిలిస్తోంది. రూ. 5 లక్షల సబ్సిడీ, రిజర్వేషన్ల శాతం, మీ-సేవ దరఖాస్తులు అంటూ సుదీర్ఘమైన నిబంధనల జాబితాను ప్రకటిస్తూ.. రాబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ఈ స్కీమ్ తెరపైకి తెచ్చారని ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.గతంలో కేసీఆర్ నేతృత్వంలోని గత ప్రభుత్వం ఉచితంగా డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు ఇస్తామని చెప్పి, లక్షలాది మంది నుంచి దరఖాస్తులు స్వీకరించి, ఓట్ల పండగ ముగిశాక పేదలను నగరానికి 30-40 కిలోమీటర్ల దూరంలో నిర్మించిన అరకొర ఇళ్లకు పరిమితం చేసింది. ఇప్పుడు రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే కేసీఆర్ ఫార్ములా ను కాస్త రూపుమార్చి అమలు చేస్తోందనే విమర్శలు వస్తున్నాయి. ఉచితం అని చెప్పకుండా.. రూ. 6 లక్షల భాగస్వామ్యం పేరుతో ప్రజల నుంచి ఆశలు రేకెత్తించి, జీహెచ్ఎంసీ ఎన్నికల్లో ప్రయోజనం పొందడానికి ఈ దరఖాస్తుల హంగామా అని ఎక్కువ మంది నమ్ముతున్నారు.ప్రస్తుతం తొలి విడతగా 16 నియోజకవర్గాల్లో ఈ ఇందిరమ్మ టవర్స్ కడతామని చెబుతున్న ప్రభుత్వం, అసలు ఇళ్లకు సరిపడా భూములు ఎక్కడ ఉన్నాయో స్పష్టం చేయడం లేదు. పార్టీ చేస్తున్న విమర్శలను విష ప్రచారం అని కొట్టిపారేస్తున్న కాంగ్రెస్ నేతలు, గత ప్రభుత్వం చేసిన పాత తప్పులనే మళ్లీ పునరావృతం చేస్తున్న సూచనలు కనిపిస్తున్నాయి. మీ-సేవ కేంద్రాలు, వాట్సాప్ నంబర్లు ఇచ్చి దరఖాస్తులు తీసుకోగానే సరిపోదని, అసలు ఇళ్లు ఎప్పటికి పూర్తవుతాయో చెప్పకుండా ఓటర్లను భ్రమల్లో ఉంచడమే కాంగ్రెస్ వ్యూహమన్న విమర్శలు ఉన్నాయి.గతంలో చూపించిన డబుల్ బెడ్‌రూమ్ డ్రీమ్ ఎలాగైతే ఓటు బ్యాంకు రాజకీయాలకు వాడుకున్నారో ఇప్పుడు ఇందిరమ్మ టవర్స్ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం కూడా అదే తరహా పథకాన్ని అమలు చేస్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పేదవాడికి నిజంగా ఇల్లు అందుతుందా లేదా అన్నది పక్కనబెడితే.. గ్రేటర్ ఎన్నికల వేళ ఈ ఇందిరమ్మ ఇళ్ల ప్రకటన మాత్రం హైదరాబాద్ రాజకీయాల్లో మరోసారి తీవ్ర కలకలం రేపుతోంది.

మల్లారెడ్డి.. అంతు చిక్కని నాడి

హైదరాబాద్, జూలై 25, (న్యూస పల్స్) తెలంగాణ రాజకీయాల్లో మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి వైఖరి ఎప్పుడూ ఆసక్తికరంగానే ఉంటుంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాల తర్వాత బీఆర్ఎస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటుండటం, అధికార కాంగ్రెస్ నేతలతోనూ, బీజేపీ అగ్రనేతలతోనూ ఆయన జరిపిన భేటీలతో మల్లారెడ్డి పార్టీ మారడం ఖాయమనే ప్రచారం జోరుగా సాగింది. కానీ ఎప్పుడూ ఆయన బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పానని మాత్రం చెప్పలేదు. ఆ పార్టీలోనే ఉంటానని అంటూంటారు.బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ జన్మదిన వేడుకల సందర్భంగా బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో వేడుకలు నిర్వహించి తాను ఎప్పటికీ బీఆర్ఎస్‌లోనే ఉంటానని స్పష్టం చేశారు. కానీ, అక్కడ ఆయన ప్రదర్శించిన హావభావాలు, వాతావరణం చూసిన రాజకీయ విశ్లేషకులు ఇది పక్కా డబుల్ గేమ్ అని క్లారిటీకి వచ్చేశారు. కేటీఆర్ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న మల్లారెడ్డి మెడలో గులాబీ రంగు కండువా ఉన్నప్పటికీ, దానిపై ఎలాంటి బీఆర్ఎస్ పార్టీ గుర్తులు లేవు. అంతేకాకుండా, ఆయన కార్యాలయం వద్ద సాధారణంగా కనిపించే జెండాలు, కేసీఆర్, కేటీఆర్‌ల భారీ కటౌట్లు లేకుండా కేవలం ఒక సాధారణ శుభాకాంక్షల బోర్డుతోనే సర్దేయడం పలు అనుమానాలకు తావిస్తోంది. బీఆర్ఎస్ పార్టీని వీడే ఆలోచన లేదని పైకి చెబుతున్నా, పార్టీ చిహ్నాలను పక్కన పెట్టడం వెనుక అధిష్ఠానానికి ఒక రకమైన సిగ్నల్ ఇస్తున్నారా అనే చర్చ క్యాడర్‌లో మొదలైంది.ఈ పరిణామాలకు ముందు, మల్లారెడ్డి వైఖరిపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ ఒక బీఆర్ఎస్ కార్యకర్త రక్తంతో లేఖ రాయడం పెద్ద కలకలమే రేపింది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు అన్ని పదవులు, అవకాశాలు అనుభవించి.. ఇప్పుడు ప్రతిపక్షంలోకి రాగానే పార్టీకి, కార్యకర్తలకు దూరంగా ఉండటం సరికాదని సదరు కార్యకర్త ఆ లేఖలో ఆవేదన వ్యక్తం చేశారు. గులాబీ శ్రేణుల్లో తన ప్రతిష్ట దెబ్బతింటోందని గ్రహించిన మల్లారెడ్డి, ఆ రక్తపు లేఖపై స్పందిస్తూ తనకు పార్టీ మారే ఉద్దేశం లేదని, ఆ లేఖ రాసిన కార్యకర్తను స్వయంగా కలిసి మాట్లాడతానని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది.ఎటు చూసినా మల్లారెడ్డి తన రాజకీయ భవిష్యత్తుపై స్పష్టమైన



క్లారిటీ ఇవ్వకుండా సేఫ్ గేమ్ ఆడుతున్నారనే వాదన బలంగా వినిపిస్తోంది. ఒకవైపు పార్టీని విడిచిపెడితే వచ్చే నష్టాలను, వ్యాపార సామ్రాజ్యాలపై పడే ప్రభావాన్ని అంచనా వేస్తూనే.. మరోవైపు బీఆర్ఎస్‌లోనే ఉంటూ సొంత గుర్తులకు, జెండాలకు దూరంగా ఉండటం ద్వారా ఆయన పొలిటికల్ సేఫ్ ఎగ్జిట్ కోసం మార్గం సుగమం చేసుకుంటున్నారని భావిస్తున్నారు.ను బీఆర్ఎస్ పార్టీని వీడుతున్నట్లు జరుగుతు ప్రచారంలో నిజం లేదన్నారు మల్లారెడ్డి. చివరివరకు బీఆర్ఎస్‌లోనే ఉంటానని.. కొంతమంది ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తున్నారని.. ఎవరూ నమ్మొద్దన్నారు. తాను పార్టీ మారబోతున్నట్లు జరుగుతున్న ప్రచారాన్ని నిజం అనుకుని ఓ అభిమాని రక్తంతో లేఖ పంపడం చూసి బాధపడ్డానని చెప్పుకొచ్చారు. లేఖ రాసిన కార్యకర్త ఎవరో తెలుసుకుని త్వరలోనే స్వయంగా కలిసి మాట్లాడతానన్నారు. కేటీఆర్ నిండు నూరేళ్లు చల్లగా ఉండాలని.. ఆయనకు బర్త్ డే విషెస్ తెలియజేశారు. తెలంగాణకు కేటీఆర్ ముఖ్యమంత్రి అవుతారని.. ఆయన్ను సీఎం కుర్చీలో చూడటమే తన లక్ష్యమన్నారు.మల్లారెడ్డి పార్టీ మారతారనే ప్రచారంతో.. ఇటీవల బీఆర్ఎస్ కార్యకర్త రక్తంతో పంపిన లేఖ వైరల్ అయ్యింది. మల్లారెడ్డి పార్టీ కార్యకలాపాలకు దూరంగా ఉంటున్నారని.. లక్షలాది మంది కార్యకర్తల విశ్వాసాన్ని మల్లారెడ్డి దెబ్బతీస్తున్నారని కార్యకర్త ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీ కార్యకర్తల్ని విస్మరించడం సరికాదని.. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు యాక్టివ్‌గా ఉన్న మల్లారెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పార్టీ కార్యక్రమాలకు ఎందుకు రావడం లేదని ప్రశ్నించారు. అధికార పార్టీ కార్యక్రమాల వేదికలపై మల్లారెడ్డి కనిపించడం వల్ల క్షేత్రస్థాయిలో ఉన్న లక్షలాది మంది కార్యకర్తల్లో తప్పుడు సంకేతాలు వెళుతున్నాయన్నారు. మల్లారెడ్డి బీఆర్ఎస్ కార్యకర్తల్ని తన సంస్థల్లో పనిచేసే ఉద్యోగులుగా చూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ నేతలు, కేడర్‌కు అండగా ఉండాల్సింది పోయి దూరంగా ఉండటం పార్టీకి నష్టమ న్నారు. పార్టీ సిద్ధాంతాలను, కార్యక ర్తలను మరచిపోయిన నేతలు చరిత్రలో కనుమరుగైపోవడం ఖాయమన్నారు. పార్టీపై ప్రేమతో లేఖ రాస్తున్నానని.. ఎలాంటి వ్యక్తిగత ద్వేషం లేదన్నారు. ఒక కార్యకర్తగా మనసులో బాధను చెబుతున్నాను అన్నారు. మొత్తానికి మల్లారెడ్డి పార్టీ మార్పు ప్రచారానికి ఎండ్ కార్డ్ వేశారు. తాను బీఆర్ఎన్‌లోనే కొనసాగుతానని మరోసారి తేల్చి చెప్పారు.

భారీగా పెరగనున్న ఆస్తి పన్ను...

హైదరాబాద్, జూలై 25, (న్యూస పల్స్)హైదరాబాద్ నగరంలోని భవనాలు, స్థలాల యజమానులకు ప్రభుత్వం బిగ్ షాక్ ఇచ్చేందుకు సిద్ధమైంది. ఇప్పటి వరకు కొనసాగుతున్న ఆస్తిపన్ను అసెస్మెంట్ విధానంలో మార్పులు తీసుకువస్తూ పాలకవర్గం సంచలన నిర్ణయం తీసుకుంది. ఇకపై సాంప్రదాయ అద్దె ప్రాతిపదికన కాకుండా.. మార్కెట్ రేట్లకు అనుగుణంగా పన్నులు వసూలు చేసేందుకు వీలుగా కొత్త బిల్లును సిద్ధం చేసింది. ఈ ప్రతిపాదిత నిబంధనలు అమల్లోకి వస్తే.. పట్టణ ప్రాంతాల్లో నివాస, వాణిజ్య ఆస్తులపై పన్ను భారం ఊహించని రీతిలో పెరగనుంది.హైదరాబాద్ నగరంలోని ఇళ్ల, వాణిజ్య సముదాయాల యజమానులపై ఆర్థిక భారం పెరగనుంది. దశాబ్దాలుగా అమల్లో ఉన్న వార్షిక అద్దె విలువ విధానానికి స్వస్తి పలికి.. దానికి బదులుగా క్యాపిటల్ విలువ ఆధారంగా ఆస్తి పన్నును నిర్ణయించేందుకు ప్రభుత్వం సమగ్ర అర్బన్ రిఫార్మ్స్ (సీయూఆర్ఈ) ముసాయిదా బిల్లులో ప్రతిపాదనలు రూపొందించింది. ఈ నూతన సంస్కరణల వల్ల నగర పరిధిలోని నివాసాల యజమానులతో పాటు వాణిజ్య సముదాయాల యజమానులపై పన్ను భారం పెరిగే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.కొత్తగా తీసుకురానున్న 'క్యూర్' ముసాయిదా బిల్లు ప్రకారం.. ఆస్తిపన్ను లెక్కించడానికి రిజిస్ట్రేషన్ శాఖ నిర్ణయించే భూమి, భవనాల క్యాపిటల్ విలువనే ప్రధాన ప్రాతిపదికగా తీసుకోనున్నారు. సాధారణంగా రియల్ ఎస్టేట్ రంగానికి అనుగుణంగా మార్కెట్లో భూముల ధరలు, భవనాల విలువలు ప్రతి సంవత్సరం పెరుగుతూనే ఉంటాయి. దీనివల్ల పన్ను శాతాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా పెంచకపోయినా, భూముల మార్కెట్ విలువ పెరగడం వల్ల ఆస్తి పన్ను కూడా ప్రతి ఏటా ఆటోమేటిక్‌గా పెరుగుతూ పోతుంది.ఈ కొత్త ముసాయిదా చట్టంలో ఆస్తుల రకాన్ని బట్టి పన్ను శాతాలను ప్రభుత్వం ప్రాథమికంగా నిర్ణయించింది. ఇళ్లకు సంబంధించి క్యాపిటల్ విలువపై 0.10 శాతం నుంచి 0.50 శాతం వరకు పన్ను స్లాబ్‌లను వర్తింపజేయాలని ప్రతిపాదించారు. వ్యాపార, వాణిజ్య సముదాయాలు, దుకాణాలకు సంబంధించి క్యాపిటల్ విలువలో 0.20 శాతం నుంచి గరిష్టంగా 2.00 శాతం వరకు పన్ను స్లాబ్‌లను విధించనున్నట్లు స్పష్టం చేశారు.ఈ ప్రతిపాదిత విధానం పూర్తిస్థాయిలో అమల్లోకి వస్తే నగరంలో ఆస్తులు ఉన్న వారిపై ఆర్థికంగా ప్రభావం పడే అవకాశం ఉంది. పెరుగుతున్న భూముల రేట్లకు అనుగుణంగా ఏటా పన్ను పెరిగే నిబంధన ఉండటంతో.. భవిష్యత్తులో పన్ను భారం మరింత పెరగనుందని స్పష్టం అవుతోంది. అది జరిగితే యజమానులు తమపై పడే పన్ను భారాన్ని అద్దెలు పెంచడం ద్వారా వూడ్చుకోవడానికి ప్రయత్నిస్తారు. దీని వల్ల అంతిమంగా భారం అద్దెదారులపైనే పడే అవకాశం ఉంటుంది.

తొలిఏకాదశి నేపథ్యంలో ప్రత్యేక పూజలు

గర్శకుర్తిలో అఖండ భజన సంకీర్తన కార్యక్రమం

చొప్పదండి ,కరీంనగర్ జిల్లా గంగాధర మండలం గర్శకుర్తి గ్రామంలో తొలిఏకాదశి పర్వదినం పురస్కరించుకుని 24 గంటల అఖండ భజన సంకీర్తణ కార్యక్రమం శనివారం ఉదయం చేపట్టారు.ఈ భజన సంకీర్తన కార్యక్రమం ఆదివారం ఉదయం వరకు నిర్విరామంగా కొనసాగనుందని నిర్వాహకులు తెలిపారు.ప్రతి యేటా తొలిఏకాదశి పర్వదినం రోజున అఖండ భజన సంకీర్తన జరుగుతోందని గత 40 ఏళ్లుగా ఎంతో భక్తిప్రపత్తుల మధ్య భజనపరులు సిని, జానపద బాణిలో భక్తిగీతాలను ఆలపించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు భక్తి శ్రద్దలతో పాల్గొంటున్నారు.

హైకోర్టు న్యాయమూర్తుల జిల్లాల పర్యటన

స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి ,కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల్లో రెండు రోజుల పర్యటనకు విచ్చేసిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తులకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ శనివారం జిల్లా కేంద్రంలో ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ ప్రవీణ్ కుమార్, జస్టిస్ మాధవీ లతలకు జిల్లా కలెక్టర్ పూల మొక్కలను అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. హైకోర్టు న్యాయమూర్తులు శనివారం, ఆదివారం రెండు రోజులపాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటించనున్నారు.

సాయిబాబా ఆలయంలో గురు పౌర్ణిమ వేడుకలు

జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్కు ఆహ్వానం

భద్రాద్రి ,భద్రాచలం జూనియర్ కళాశాల సెంటర్లోని శ్రీ షిరిడి సాయిబాబా ఆలయంలో ఈ నెల 29న నిర్వహించనున్న గురు పౌర్ణిమ మహోత్సవాలకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పోలీసు సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ రోహిత్ రాజ్ ను ఆలయ చైర్మన్ కొమ్మనాపల్లి ఆదినారాయణ మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎస్పీ రోహిత్ రాజ్ను శాలువాతో ఘనంగా సత్కరించిన ఆలయ ప్రతినిధులు, శ్రీ షిరిడి సాయిబాబా వారి మెమెంటో, ప్రసాదం అందజేశారు. అలాగే గురు పౌర్ణిమ వేడుకల ఆహ్వాన పత్రికను అందించి, కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై ఆశీర్వదించాలని కోరారు. శనివారం జరిగిన ఈ ఆహ్వాన కార్యక్రమంలో ఆలయ ఉపాధ్యక్షులు కొమ్మనాపల్లి వెంకటరమణ, కోశాధికారి గొర్ల వెంకటేశ్వరరావు, ప్రధాన అర్చకులు శ్రీరామ్ శర్మ, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, గురు పౌర్ణిమ పర్వదినం సందర్భంగా ప్రత్యేక పూజలు, భజనలు, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బాబా వారి ఆశీస్సులు పొందాలని కోరారు.

మైనర్ బాలికపై లైంగిక దాడి

మేనమామ, వరుస సోదరులే నిందితులు

మేడ్చల్,గంజాయి మత్తులో మైనర్ బాలికపై మేనమామ, సోదరులు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. మేడ్చల్ జిల్లా కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో ఘటన జరిగింది. బాధిత బాలిక తన తల్లిదండ్రులు చనిపోవడంతో కీసరలోని తన అమ్మమ్మ వద్ద ఉంటోంది. స్థానికుల సహాయంతో తుర్కపల్లిలోని వసతి గృహంలో చేరి, ఇటీవల సెలవులు కావడంతో కీసరలోని అమ్మమ్మ ఇంటికి వచ్చింది.ఒంటరిగా ఉన్న సమయంలో గంజాయి మత్తులో మేనమామ, వరుసకు సోదరులైన ఇద్దరు యువకులు బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. నిందితులు విషయం బయటకు రాకుండా జాగ్రత్త పడ్డారు. వసతి గృహానికి వెళ్లిన బాలికకు అక్కడ ఫ్యాన్ తగిలి గాయాలు అఅయయాయి. అమ్మమ్మ దగ్గరికి తిరిగి రాగా లైంగిక దాడి విషయం బయటపడింది. పోలీసులు నిందితుల్లో ఒకరిని అదుపులోకి తీసుకున్నారు. పరారైన ఇద్దరి గురించి గాలింపు కొనసాగుతోంది.

చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం.. వెబ్, యాప్‌లో నిలిచిపోయిన సేవలు.. యూజర్ల ఫిర్యాదు

ప్రపంచవ్యాప్తంగా అనేక చోట్ల చాట్‌జీపీటీ సేవల్లో అంతరాయం ఏర్పడింది. జూలై 25, శనివారం మధ్యాహ్నం నుంచి ఈ పరిస్థితి తలెత్తింది. మధ్యాహ్నం 2.54 గంటల నుంచి ఈ పరిస్థితి ఎదురవుతోందని నెటిజన్లు తమ సోషల్ మీడియా ఖాతాల్లో ఫిర్యాదు చేస్తున్నారు. ఇటు వెబ్ ఇంటర్‌ఫేస్‌లోనూ, అటు మొబైల్ అప్లికేషన్‌లోనూ అనేక సేవలు పనిచేయడం లేదని యూజర్లు ఫిర్యాదు చేస్తున్నారు.లాగిన్ అవ్వడం లేదని, చాట్స్ సెక్షన్ పనిచేయడం లేదని, యాప్‌పై పూర్తిగా యాక్సెస్ చేయలేకపోతున్నామని ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల నుంచి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఇలాంటి యాప్, నెట్ సేవలు డౌన్ అయితే, ఆ వివరాల్ని డౌన్‌డిటెక్టర్ నమోదు చేస్తుంది. ఈ సంస్థ గుర్తించిన వివరాల ప్రకారం.. నార్మల్ ఆపరేషన్‌కు సంబంధించి 2 బేస్‌లైన్ రిపోర్ట్‌లను గుర్తించింది. నిమిషాల వ్యవధిలో వందలకొద్దీ ఫిర్యాదులు నమోదయ్యాయి. ఐఓఎస్, ఆండ్రాయిడ్‌తోపాటు డెవలపర్ ఏపీఐలలోనూ, వెబ్‌లోనూ ఈ చాట్‌జీపీటీ పని చేయడం లేదు. స్థానిక నెట్‌వర్క్‌లో సమస్యలకంటే.. సంస్థకు చెందిన గ్లోబల్ సర్వర్లలో సమస్య ఉన్నట్లు నిపుణులు అంచనా వేస్తున్నారు.అమెరికా, బ్రిటన్‌లోనూ చాట్‌జీపీటీ సేవలు నిలిచిపోయాయి. ఇదే విషయాన్ని చాట్‌జీపీటీ నిర్వహణా సంస్థ ఓపెన్ఏఐ కూడా ధృవీకరించింది. ఎలివేటెడ్ ఎర్రర్ రేట్స్ కింద ఈ సమస్యను పరిగణిస్తున్నట్లు సంస్థ తెలిపింది. దీనిపై విచారణ జరుపుతున్నట్లు సమస్య పరిష్కారానికి ప్రయత్నిస్తున్నట్లు సంస్త ప్రకటించింది. ఇటీవల కూడా చాట్‌జీపీటీలో ఇమేజ్ జనరేటర్ సమస్య ఏర్పడింది. దీన్ని కొన్ని గంటల్లోనే సంస్థ పరిష్కరించింది.

రెజ్లర్ లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తా

అమీర్ పేట ,రెజ్లర్ లకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తానని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ప్రకటించారు. శనివారం అమీర్ పేట లోని మున్సిపల్ స్టేడియంలో తలసాని ట్రస్ట్ ఆధ్వర్యంలో నగరంలోని 70 వ్యాయామశాలల నిర్వాహకులకు రెజ్లింగ్ మ్యాట్ లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెజ్లింగ్ ను కుస్తీ పోటీలు గా, రామాయణ, మహాభారతం కాలంలో మల్లయుద్ధం గా పిలుచుకునే వారని పేర్కొన్నారు. 5 వేల సంవత్సరాల చరిత్ర కలిగిన కుస్తీ పోటీలను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఆర్థికంగా కొంత ఇబ్బందులు ఉన్నప్పటికీ, కుస్తీపై ఉన్న అభిమానం తో అనేకమంది వారసత్వం గా పోటీలకు శిక్షణ పొందుతున్నారని అన్నారు. ప్రతి సంవత్సరం 150 మంది రెజ్లర్లు వివిధ కెటగిరీలలో జాతీయ స్థాయి పోటీలకు హాజరవుతారని, వారికి అవసరమైన ట్రాక్, షూస్, రవాణా ఖర్చులను తన జీవితకాలం పాటు అందిస్తానని ప్రకటించారు. వ్యాయామశాలల్లో సరైన సౌకర్యాలు లేకపోవడం వలన కొంత ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. రెజ్లర్లు మట్టిలో కుస్తీ పోటీల ప్రాక్టీస్ చేస్తున్నారని, దీనిని దృష్టిలో ఉంచుకొని వారికి సౌకర్యవంతంగా ఉండేలా 70 వ్యాయామశాలలకు ఒక్కో వ్యాయామశాల కు 10 చొప్పున మ్యాట్ లను అందజేసినట్లు చెప్పారు. వ్యాయామశాలల అభివృద్ధి, రెజ్లర్ లకు చేయూత అందించేలా భవిష్యత్ లో మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు. తిరిగి తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ పరంగా అన్ని రకాలుగా సహకారాన్ని అందిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా ధాతలను ఆయన సన్మానించారు.

ఫీజ్ తిరిగి చెల్లింపుల కోరుతూ పోస్టర్ విడుదల

హైదరాబాద్,జూలై25:భారతీయ జనతా యువ మోర్చా మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాగం అర్జున్ ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉంచిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ చేపట్టిన రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగంగా పోస్టర్ విడుదల కార్యక్రమం మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ నివాసంలో ఘనంగా నిర్వహించబడింది.ఈ కార్యక్రమాన్ని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పోస్టర్‌ను ఆవిష్కరించి ప్రారంభించారు. ఈ సందర్భంగా బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు బుద్ధి శ్రీను మాజీ జిల్లా అధ్యక్షులు పట్లోళ్ల విక్రమ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల వేలాది మంది విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం భారతీయ జనతా పార్టీ, భారతీయ జనతా యువ మోర్చా నిరంతరం పోరాటం కొనసాగిస్తాయని స్పష్టం చేశారు.రాగం అర్జున్ మాట్లాడుతూ, విద్యార్థుల సమస్యల పరిష్కారమే భారతీయ జనతా యువ మోర్చా ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వం వెంటనే పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేసి విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించే వరకు ప్రజాస్వామ్యబద్ధంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కన్వీనర్ ప్రవీణ్ రావు బీజేపీ మహిళా మోర్చా జిల్లా సహ కన్వీనర్ సుగుణ రెడ్డి , భారతీయ జనతా యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి వరప్రసాద్ రెడ్డి , యువ మోర్చా నాయకులు సామల పవన్ రెడ్డి చిత్రాంజన్ రెడ్డి విక్రమ్ సింగ్ , జిల్లా నాయకులు మధుసూదన్ గౌడ్ బోయిని శివ సాయి గౌడ్ నరేందర్ రెడ్డి శరత్ ,గణేష్, ప్రణయ్,మధు, పవన్ గౌడ్ , అలాగే భారతీయ జనతా పార్టీ, భారతీయ జనతా యువ మోర్చా జిల్లా, మండల, శక్తికేంద్ర, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.



పట్నం సోదరులకు పలువురి పరామర్శ

హైదరాబాద్,మాతృ యోగానికి గురైన పట్నం సోదరులను పలువురు పరామర్శించారు. మాజీ మంత్రి, శాసన మండలి ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి, కోడంగల్ మాజీ ఎంఎల్ఏ పట్నం నరేందర్ రెడ్డి ల మాతృ మూర్తి పట్నం రుక్మమ్మ మృతి చెందిన నేపథ్యంలో బంజారాహిల్స్ లోని మహేందర్ రెడ్డి నివాసంలో దుర్గమ్మ పార్థివ దేహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు.స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, దుద్దిల్ల శ్రీధర బాబు లు నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.అలాగే ఎంఎల్ఏలు మనోహర్ రెడ్డి, రామ్మోహన్ రెడ్డి, ప్రకాష్ గౌడ్, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ ఎంపీ గడ్డం రంజిత్ రెడ్డి, ఎంఎల్సీలు ఏవీఎన్ రెడ్డి,దామోదర్ రెడ్డి మాజీ మంత్రి ఏ. చంద్రశేఖర్, మాజీ ఎంఎల్ఏ లు కేఎస్ రత్నం, కేఎల్ ఆర్, జైపాల్ యాదవ్, వికారాబాద్,మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ధారాసింగ్, వజ్రేష్ యాదవ్, ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి పరమేశ్వర్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ లు సత్యనారాయణ రెడ్డి, కాలే శ్రీకాంత్, మహిపాల్, రవి గౌడ్ తదితరులు పట్నం సోదరులను పరామర్శించారు.

ప్రజాస్వామ్యం గెలిచింది.. విద్యార్థుల సామూహిక సంకల్ప విజయమిది: అభిజీత్ దీప్కే

న్యూఢిల్లీ: విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) వ్యవస్థాపకుడు అభిజీత్ దిప్కే హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యం, విద్యార్థులు సాధించిన విజయంగా పేర్కొన్నారు. నీట్ పేపర్ లీక్ వివాదంపై కొన్ని వారాలుగా కొనసాగిన నిరసనల ఫలితంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకునేలా విద్యార్థులు ఒత్తిడి తెచ్చారని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థుల సామూహిక సంకల్పానికి లభించిన విజయమని ఆయన అభివర్ణించారు.కాగా, నిరంతర శాంతియుత నిరసనలు మార్పును తీసుకురాగలవని చెప్పడానికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా ఒక నిదర్శనమని అభిజీత్ దిప్కే తెలిపారు. 'ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. మీరు భయపడకపోతే, ఈ ప్రభుత్వానికి తలొగ్గకపోతే, మనం ఎవరితోనైనా రాజీనామా చేయించగలమని చెప్పడానికి ఇది నిదర్శనం' అని అన్నారు.అలాగే నీట్ పేపర్ లీక్ వివాదం తర్వాత ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల పేర్లను దీప్కే గుర్తు చేసుకున్నారు. వారి స్మృతి కోసం రెండు నిమిషాల పాటు మౌనం పాటించాలని నిరసనకారులను కోరారు. అనంతరం ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నిరసన ప్రాంగణంలో విద్యార్థుల సంబరాలు హోరెత్తాయి.



వైద్య ఆరోగ్య సిబ్బంది ఇంటింటి సర్వే




కామారెడ్డి,జూలై25:కామారెడ్డి అర్బన్, పట్టణ ఆరోగ్య కేంద్రం ఇస్లాంపూర లో శనివారం పట్టణ ఆరోగ్య కేంద్రం ఇస్లాంపుర పరిధిలోని అన్ని ఏరియాలలో , అసంక్రమిత వ్యాధులు రక్తపోటు, మధుమేహం, క్యాన్సర్, రోగములకు, వైద్య సిబ్బంది ప్రతి ఇంటింట తిరుగుతూ సర్వే చేశారు, ఈ పనిలో భాగంగానే, హరిజనవాడ ఏరియా లో కూడా ఆశ, ఏఎన్ఎం సిస్టర్స్ ఈ సర్వే నిర్వహించే పని తీరుపై ఆరోగ్య విస్తరణ అధికారి రవిందర్ఆన్లైన్ పని పర్యవేక్షించారు, , ఈ సర్వే జూలై చివరివరకు తప్పక పూర్తి చేయాలని డా చందన ప్రియ ఆరోగ్య విస్తరణ అధికారి రవీందర్ ఆశ,ఏఎన్ ఎం సిబ్బంది కి సూచించారు, ప్రజలు వారి వారి ఇంటివద్ద ఇంటి పరిసరములలో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి, వారములో రెండు సార్లు డ్రై డే యాక్టివిటీస్ చేయాలని సూచించారు , తద్వారా దోమలు వృద్ధి కాకుండా జాగ్రత్త పడవచ్చును, అదేవిధముగా దోమలనుండి వచ్చి రోగాలు, మలేరియా, డెంగ్యూ,చికెన్గున్యా, ఫైలేరియా మొదలగు వ్యాధులు రాకుండా ధన్యవాదములువుండును మరియు ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి తద్వారా రోగాలు రాకుండా జాగ్రత్త పడవచ్చునని తెలిపారు.

తాగునీటి సమస్యలు తలెత్తద్దు

హైదరాబాద్,జూలై25:సచివాలయం లో మిషన్ భగీరథ పై మంత్రి సీతక్కశనివారం సమీక్ష నిర్వహించారు. పాల్గొన్న స్పెషల్ సిఎస్ దాన కిషోర్, మిషన్ భగీరథ ఈఎన్సిసి కృపాకర్ రెడ్డి, సీఈలు, ఎస్ ఈ లు మంచినీటి సరఫరా పై సమీక్షఎట్టి పరిస్థితుల్లో తాగునీటి సమస్యలు రాకుండా యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసినట్లు తెలిపిన అధికారులు.సింగూరు పాలేరు రిజర్వాయర్లలో కాస్త నీటి నిల్వలో తప్పుగా ఉన్నాయని, అయినప్పటికీ వచ్చే వంద రోజులు పాటు ఎలాంటి సమస్యలు లేకుండా యాక్షన్ ప్లాన్ అమలు చేస్తున్నట్టు తెలిపిన అధికారులుప్రతిరోజు రిజర్వాయర్లలో నీటిమట్టాలను తెలుకుంటూ, అనుగుణంగా చర్యలు చేపట్టాలని ఆదేశించిన మంత్రి సీతక్క.రిజర్వాయర్లల తోపాటు స్థానిక నీటి వనరులను గుర్తించి, నీటి సరఫరాకు ప్లాన్ చేయాలని ఆదేశాలుబోర్ వెల్స్ వద్ద రీఛార్జింగ్ పిట్స్, రైన్ వాటర్ హార్వెస్టింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలుగ్రామాల వారీగా మహిళా సంఘాలు, సర్పంచ్ వార్డు సభ్యులు,పంచాయతీ కార్యదర్శలు తో వాట్సాప్ గ్రూపులు ఏర్పాటుచేసి నీటి సరఫరా వేలలను ఎప్పటికప్పుడు ఇన్ఫార్మ్ చేయాలని ఆదేశాలు

'మోదీ సర్కారు అహంకారం ఓడింది'.. ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై ఖర్గే



న్యూఢిల్లీ, దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ ప్రశ్నాపత్రం లీకేజీ వివాదం, ఢిల్లీలో విద్యార్థుల నిరసనల నేపథ్యంలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఈ ఉదయం తన పదవికి రాజీనామా చేశారు. దీనిపై తాజాగా కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పందించారు.దేశంలోని విద్యార్థుల గొంతుక ఎట్టకేలకు అహంకారపూరిత ప్రభుత్వ గడపను తాకిందని ఖర్గే వ్యాఖ్యానించారు. విద్యావ్యవస్థ ప్రక్షాళనను కోరుతూ దేశవ్యాప్తంగా వీధుల్లోకి వచ్చి గళమెత్తిన లక్షలాది మంది యువత సాధించిన విజయమిదని ఆయన 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు. ఇది సత్యానికి లభించిన విజయమని, ప్రధాని మోదీ మొండి వైఖరికి దక్కిన ఓటమి అని వ్యాఖ్యానించారు. అవినీతిమయమైన ఈ ప్రభుత్వం కారణంగా నష్టపోయిన కుటుంబాలు అన్నింటిదీ ఈ విజయమని పేర్కొన్నారు. విద్యార్థుల ప్రయోజనాల పరిరక్షణ కోసం పార్లమెంటు నుంచి వీధుల వరకు ఏకతాటిపై నిలిచి పోరాడిన ప్రతిపక్షాల ఐక్యతే ఈ విజయానికి కారణమని ఆయన స్పష్టంచేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ దేశ యువతరానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నిరసనలు తెలుపుతున్న విద్యార్థులపై లాఠీచార్జి చేసి, దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు.ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాపై నటి ప్రియాంక చోప్రా సామాజిక మాధ్యమాల వేదికగా స్పందించారు. విద్యార్థుల పోరాటాన్ని ప్రస్తావిస్తూ.. ఇది తమ డిమాండ్ల కోసం దృఢంగా నిలబడి నిరసన తెలిపిన యువతకు, ప్రజాస్వామ్యానికి దక్కిన భారీ విజయమని ఆమె పేర్కొన్నారు. ఈ పోస్టు క్షణాల్లో వైరల్ కాగా దీనిపై ప్రియాంక చోప్రా స్పందిస్తూ 'నమస్కారం', 'లవ్' ఎమోజీలను జతచేసి తన మద్దతు చాటారు

దేశంలోని యువతకు ఇది ఒక గొప్ప విజయం : హరీశ్ రావు

హైదరాబాద్, జూలై25 నీట్ పేపర్ లీకేజీ వ్యవహారంలో సీజీపీతోపాటు విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో వారి డిమాండ్ల మేరకు ధర్మేంద్ర ప్రధాన్ తలొగ్గుతూ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే. తమ మూడు డిమాండ్లు నెరవేరడంతో ఆందోళన విరమిస్తున్నట్టు సీజీపీ ప్రకటించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి, బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు స్పందించారు.తాజా సందర్భాన్ని దేశంలోని యువతకు ఇది ఒక గొప్ప విజయంగా హరీశ్ రావు అభివర్ణించారు.. సామాజిక దృక్పథంలో వస్తున్న మార్పు నిజంగానే కనిపిస్తోంది. విద్యార్థులందరికీ అభినందనలు.. అంటూ ఎక్స్‌లో ట్వీట్ చేశారు.ఈ గొప్ప దేశంలోని విద్యార్థులు, యువత, 'జెన్-జెడ్' (ఉవని-జి) టీంకు అభినందనలు. ఈ విజయం మీదే. మీకు మా మద్దతును అందించినందుకు సంతోషంగా ఉంది.

ఇందిరమ్మ టవర్స్‌పై సందేహాల నివృత్తికి కాల్‌సెంటర్ హెల్ప్‌లైన్ ఏర్పాటు



హైదరాబాద్ జూలై 25.)హైదరాబాద్ మహానగరంలోని పేద, దిగువ మధ్యతరగతి కుటుంబాలకు నగర నడిబొడ్డున గౌరవప్రదమైన సొంతింటిని అందించాలనే గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సంకల్పాన్ని కార్యరూపంలోకి తీసుకువస్తూ ప్రజా ప్రభుత్వం క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ కార్యక్రమాన్ని చేపట్టిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార ఔర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ పథకంపై ప్రజల్లో ఎలాంటి గందరగోళం, అపోహలు లేకుండా దరఖాస్తు విధానం, అర్హతలు, అవసరమైన పత్రాలు, చెల్లింపులు, కేటాయింపు విధానం తదితర అంశాలపై పూర్తి సమాచారం అందించేందుకు ప్రత్యేక కాల్ సెంటర్ హెల్ప్‌లైన్‌ను శనివారం హౌసింగ్ బోర్డు కార్యాలయంలో మంత్రి గారు ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రజలు ఎలాంటి సందేహాలు ఉన్నా మధ్యవర్తులను నమ్మకుండా నేరుగా 040-24603572 నంబర్‌కు ఉదయం 9 గంటల నుంచి సాయింత్రం 6గంటలమధ్య ఫోన్ చేసి అధికారిక సమాచారాన్ని తెలుసుకోవాలని సూచించారు. దరఖాస్తుదారుల సౌకర్యార్థం తెలుగు , హిందీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషలలో సమాచారం తెలియజేయడం జరుగుతుందన్నారు. ప్రభుత్వం నుంచి సరైన సమాచారం అందించేందుకు ఈ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. క్యూర్ పరిధిలో లక్ష ఇళ్ల నిర్మాణం లక్ష్యంగా తొలివిడతలో 16 నియోజకవర్గాలలో 7680 ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం

040-24603572 ను ప్రారంభించిన మంత్రి పొంగులేటి
యూపిఐ ద్వారానే రూ.10వేల ఇఎండి చెల్లించాలి
ఇల్లు రాకపోతే అదే ఖాతాకు తిరిగి చెల్లిస్తాం
దరఖాస్తు సమయంలో ఎలాంటి పత్రాల సమర్పణ అవసరం లేదు
ఆధార్ ఒక్కటి చాలు
పదేళ్లు క్యూర్ పరిధిలో నివాసం ఉన్నవారు అర్హులు
మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

చుట్టినట్లు తెలిపారు. నియోజకవర్గాన్ని యూనిట్‌గా తీసుకుని ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని, ఏ నియోజకవర్గానికి చెందిన ప్రజలు అదే నియోజకవర్గంలో దరఖాస్తు చేసుకోవాలని మంత్రిగారు సూచించారు. దరఖాస్తు దారులు ఎలాంటి విష ప్రచారాలను నమ్మకూడదని మీ సేవ కేంద్రాలు, ఆన్‌లైన్ పోర్టల్,వాట్సాప్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. హైదరాబాద్ క్యూర్ ఏరియా ప్రాంతంలో నివసిస్తున్న అల్పాదాయ వర్గాల కుటుంబాల కోసం ఈ పథకాన్ని రూపొందించామని కుటుంబ వార్షిక ఆదాయం ?6.00 లక్షల వరకు ఉండాలి. ఒక కుటుంబం నుంచి ఒక దరఖాస్తు మాత్రమే స్వీకరించబడుతుందని అర్హత కలిగిన కుటుంబానికి ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయించబడుతుందన్నారు. అందిన దరఖాస్తులను డిజిటల్ విధానంలో పరిశీలించడంతో పాటు, క్షేత్రస్థాయి పరిశీలన మరియు సమగ్ర ధృవీకరణ నిర్వహిస్తామన్నారు. నిర్మిస్తున్న ఫ్లాట్ల సంఖ్య కంటే అర్హులైన దరఖాస్తుదారుల సంఖ్య ఎక్కువగా ఉంటే, పారదర్శకమైన విధానంలో లాటరీ ద్వారా ఇండ్లను కేటాయిస్తామన్నారు. దరఖాస్తుదారు క్యూర్ పరిధిలో పదేళ్లుగా నివాసం ఉండాలని, దరఖాస్తుదారు లేదా కుటుంబానికి ఓ ఆర్ ఆర్, క్యూర్ పరిధిలో సొంత ఇల్లు లేదా ఫ్లాట్ లేదా ప్లాట్ ఉండకూడదని, ఒక కుటుంబానికి ఒక దరఖాస్తు ఒక ఫ్లాట్ మాత్రమే కేటాయింపు ఉంటుందని తెలిపారు. దరఖాస్తు చేసే సమయంలో ఆధార్ నెంబర్ తెలియజేస్తే సరిపోతుందని ,కుల, జీత భత్యాల ధృవీకరణ పత్రాలను అప్ లోడ్ చేయాల్సిన అవసరం లేదని లాటరీ సమయంలో వీటిని సమర్పించవచ్చునని తెలిపారు. దరఖాస్తు సమయంలో 10 వేల రూపాయిల చెల్లింపునకు యూపిఐ లేదా నెట్ బ్యాంకింగ్‌ను మాత్రమే ఉపయోగించాలని, ఒక వేళ ఇల్లు మంజూరు కాకపోతే తిరిగి అదే ఖాతాకు ఆ మొత్తం వాపసు అవుతుందన్నారు. పరిశీలన, కేటాయింపు, వాపసు తదితర సమాచారం పూర్తయ్యేవరకు మీసేవ రశీదు, చెల్లింపు రశీదు, దరఖాస్తు నంఖ్య, మొబైల్‌నెంబర్‌లను యాక్టివ్‌గా ఉంచుకోవాలని మంత్రి గారు సూచించారు. ఈ పథకం కింద ప్రతిపాదించిన ఫ్లాట్లు ఒక బెడ్‌రూమ్, హాల్ మరియు కిచెన్‌తో, సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంతో నిర్మిస్తున్నామన్నారు. ఒక్కో ఫ్లాట్ ఖరీదు 40 నుంచి 60 లక్షల రూపాయిల వరకు ఉంటుందని, ఇందులో ప్రభుత్వం ఐదు లక్షల రూపాయిల సబ్సిడీతో పాటు అన్ డివైడెడ్ షేర్ కింద 20 నుంచి 25 గజాల స్థలాన్ని కూడా లబ్దిదారుని పేరిట రిజిస్ట్రేషన్ చేపడుతుందన్నారు. లబ్దిదారుడు కేవలం ఆరు లక్షల రూపాయిలు మాత్రమే చెల్లించవలసి ఉంటుందన్నారు. ఈకార్యక్రమంలో హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి వి.పి.గౌతమ్, హౌసింగ్ బోర్డు సీఈ రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో మారుతున్న పరిణామాలు



న్యూఢిల్లీ, కేంద్ర మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా తరువాత న్యూఢిల్లీలో పరిణామాలు వేగంగా మారుతున్నాయి. ఢిల్లీకి రావాలని మహారాష్ట్ర సీఎం ఫడణవీస్‌కు అధిష్టానం నుంచి పిలుపు వచ్చింది. సీఎంతో పాటు డిప్యూటీ సీఎం షిండేకు కూడా ఢిల్లీ పెద్దల నుంచి పిలుపు వచ్చింది. కీలక నేతలకు హైకమాండ్ పిలుపుతో రాజకీయాల్లో ఉత్కంఠ నెలకొంది. కేంద్రం భారీ మార్పులకు సిద్ధం అవుతోందా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ దిశగా శివసేన ఉద్ధవ్ వర్గం నేత సంజయ్ రౌత్ కీలక వ్యాఖ్యలు చేశారు. మహారాష్ట్రలో సీఎం మార్పు జరుగబోతోందని అన్నారు. ఫడణవీస్‌కు కేంద్ర విద్యాశాఖను ఇవ్వబోతున్నారని చెప్పారు.కేంద్ర మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ కొంత కాలంగా వాయిదా పడుతున్న విషయం తెలిసిందే. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభానికి ముందే ఇందుకు సంబంధించిన కసరత్తు పూర్తి చేయాలని కేంద్రం భావించినట్టు జాతీయ మీడియాలో కథనాలు వెలువడ్డాయి. అయితే, ప్రధాని విదేశీ పర్యటనల కారణంగా ఈ ప్రక్రియ కొంతకాలం పాటు వాయిదా పడినట్టు సమాచారం. ఇక పునర్‌వ్యవస్థీకరణలో భాగంగా ప్రధాన్ సహా ఇతర మంత్రులు తప్పుకునే అవకాశం ఉన్నట్టు వార్తలు వచ్చాయి. ఈలోపు విద్యార్థుల నిరసనలు మిన్నంటాయి. విపక్షలా నిరసనల నేపథ్యంలో గత కొన్ని రోజులుగా పార్లమెంటు కూడా ఎలాంటి కార్యకలాపాలు జరగకుండానే వాయిదా పడుతోంది.తాజాగా విద్యాశాఖ మంత్రి తప్పుకోవడంతో ఆ శాఖ ఎవరికి కేటాయిస్తారన్న ఉత్కంఠ మొదలైంది. ఇతర ప్రభుత్వ శాఖల విషయంలో ప్రభుత్వం ఏదైనా నిర్ణయం తీసుకుంటుందా అన్న చర్చ జరుగుతోంది. నిన్న రాత్రి కేంద్రం 12 శాఖల సెక్రటరీలకు స్థాన చలనం కలిగించింది. వారిలో విద్యాశాఖ సెక్రటరీ కూడా ఉన్నారు. దీంతో, మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణపై కేంద్రం పూర్తిస్థాయి దృష్టి పెట్టనుందా? అన్న చర్చ జరుగుతోంది.

పోలీసులతో వాంగ్‌చుక్ వాగ్వివాదం.. వైరల్‌గా మారిన సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి

సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్‌చుక్ సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో పోలీసులతో వాగ్వివాదానికి దిగిన దృశ్యాల తాలూకా వీడియో ఒకటి సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి నుంచి తనను బయటకు వెళ్లనివ్వకుండా పోలీసులు అడ్డుకుంటున్నారని ఆరోపిస్తూ వాంగ్‌చుక్ తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. పోలీసుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ నేలపై పడుకుని నిరసన తెలిపారు.



ఇంతకీ ఏం జరిగిందంటే.. జంతర్‌మంతర్ వద్ద ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న వాంగ్‌చుక్‌ను ఢిల్లీ హైకోర్టు ఆదేశాల మేరకు జులై 18వ తేదీన పోలీసులు బలవంతంగా సఫ్దర్‌జంగ్ ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయనను మేదాంత ఆస్పత్రికి తరలించేందుకు ఢిల్లీ హైకోర్టు అనుమతి ఇచ్చింది.హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో వాంగ్‌చుక్ జులై 21వ తేదీన సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి నుంచి మేదాంత ఆస్పత్రికి వెళ్లడానికి సిద్ధమయ్యారు. అయితే, పోలీసులు ఆయనను అక్కడినుంచి వెళ్లనీయకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ వాంగ్‌చుక్ వాగ్వివాదానికి దిగారు. 'వాళ్లను నన్ను అరెస్ట్ చేయమని చెప్పండి. మీరందరూ నన్ను వేధిస్తున్నారు. నేను ఒత్తిడితో చనిపోతే.. దానికి కారణం మీరే' అంటూ వాంగ్‌చుక్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు దీనికి సమాధానం ఇస్తూ.. 'మేము మిమ్మల్ని వేధించటం లేదు' అని అన్నారు. ఆస్పత్రి డాక్టర్‌తో కూడా వాంగ్‌చుక్ వాగ్వివాదానికి దిగారు.'మీరు డాక్టరా లేక కసాయి వ్యక్తా' అంటూ మండిపడ్డారు. సఫ్దర్‌జంగ్ ఆస్పత్రి నుంచి మేదాంత ఆస్పత్రికి వెళ్లిన తర్వాత వాంగ్‌చుక్ ఓ వీడియా రికార్డ్ చేసి సోషల్ మీడియాలో రిలీజ్ చేశారు

[redacted]

అక్కడినుంచి రానివ్వలేదు. వాళ్ల ప్లాన్స్ ఏంటో నాకు తెలీదు. మా సామాన్లు మొ

[redacted]

మూడు గంటల పాటు మమ్మల్ని అక్కడినుంచి బయటకు రానివ్వలేదు. నేను గొడ

[redacted]

పడుకుని నిరసన తెలపాల్సి వచ్చింది' అని చెప్పుకొచ్చారు.

నల్లగొండ పట్టణ ప్రగతిలో మరో కీలక ముందడుగు

. కొత్త ఫ్లైఓవర్ ప్రారంభం



నార్కట్ పల్లి, జూలై25(:నార్కట్‌పల్లి – అద్దంకి – మేదరమెట్ల రహదారిపై మర్రిగూడ జంక్షన్ వద్ద నూతనంగా నిర్మించిన ఫ్లైఓవర్‌ను రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి లాంఛనంగా ప్రారంభించారు.ఈ ఫ్లైఓవర్ అందుబాటులోకి రావడంతో నల్లగొండ పట్టణవాసులతో పాటు, ఈ రహదారిపై నిత్యం ప్రయాణించే వేలాది మంది వాహనదారులకు ట్రాఫిక్ కష్టాలు తీరనున్నాయి. అత్యంత రద్దీగా ఉండే మర్రిగూడ జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాలను నివారించి, ప్రజలకు సురక్షితమైన అలాగే వేగవంతమైన ప్రయాణ అనుభవాన్ని అందించడానికి ఈ వంతెన ఎంతగానో ఉపయోగపడుతుంది.మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందనడానికి ఈ ప్రాజెక్టు ఒక ప్రత్యక్ష నిదర్శనం. రవాణా వ్యవస్థను మెరుగుపరచడం ద్వారా నల్లగొండ ప్రాంత ఆర్థిక మరియు వాణిజ్య వృద్ధికి ఈ నూతన ఫ్లైఓవర్ రహదారిని సుగమం చేస్తుంది. ఈ అభివృద్ధి కార్యక్రమం పట్ల ప్రాంతీయ ప్రజలు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యుత్ సమస్యను పరిష్కరించిన ఎమ్మెల్యే శ్రీధర్

చిట్వేలి ,చిట్వేలి పట్టణంలోని సత్యమ్మ వీధి కుమ్మరి వాడలో ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ సదుపాయం లేక స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు . కూటమి ప్రభుత్వం నేతృత్వంలో ఈ సమస్యకు ఎట్టకేలకు శాశ్వత పరిష్కారం లభించింది. రైల్వే కోడూరు శాసనసభ్యులు అరవ శ్రీధర్ ప్రత్యేక చొరవతో, రైల్వే కోడూరు నియోజకవర్గ టీడీపీ నాయకురాలు ముక్కా వరలక్ష్మి ఆ ప్రాంతంలో విద్యుత్ సదుపాయాల కల్పనకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా అరవ శ్రీధర్, ముక్కా వరలక్ష్మి, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి విద్యుత్ సదుపాయాల ఏర్పాటుకు సంబంధించిన పనులను ప్రారంభించారు. దశాబ్దాలుగా పరిష్కారం కాని సమస్యకు ఇప్పుడు శాశ్వత పరిష్కారం లభించడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యను గుర్తించి దశలవారీగా పరిష్కరిస్తున్నామని అన్నారు. ఎన్నో సంవత్సరాలుగా విద్యుత్ సౌకర్యం కోసం ఎదురుచూస్తున్న ఈ ప్రాంత ప్రజలకు నేడు ఆ కలను నిజం చేయడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని అన్నారు.ముక్కా వరలక్ష్మి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడమే తమ లక్ష్యమని అన్నారు. గతంలో ఎవరూ పట్టించుకోని సమస్యలను గుర్తించి ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని, ప్రతి ఇంటికి మౌలిక


[redacted]

తరం కృషి చేస్తామని తెలిపారు. ఈ

[redacted]

అధికారులు, కూటమి నాయకులు

రెంటికి చెడ్డా చెవిరెడ్డి



తిరుపతి జూలై 25, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఒకప్పుడు అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా, నమ్మినబంటుగా చక్రం తిప్పిన మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజకీయ భవిష్యత్తు ఇప్పుడు తీవ్ర అంధకారంలో పడినట్లే కనిపిస్తోంది. పార్టీలో ఆయనకు దక్కిన ప్రాధాన్యత, హోదా మరే నాయకుడికీ లభించలేదనడంలో సందేహం లేదు. గత సార్వత్రిక ఎన్నికల్లో ఏకంగా ఒంగోలు లోక్‌సభ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు అప్పగించడమే కాకుండా, ఎంపీ టికెట్ ఇచ్చి మరీ బరిలోకి దించారు. కానీ, మారిన పరిస్థితులు, అంతర్గతంగా బయటపడిన సంచలన నిజాలు జగన్ మోహన్ రెడ్డికి తీవ్ర ఆగ్రహాన్ని తెప్పించాయని, ఫలితంగానే చెవిరెడ్డిని పార్టీ యాజమాన్యం పూర్తిగా పక్కన పెట్టేసిందనే చర్చ వైసీపీ వర్గాల్లో తీవ్రంగా సాగుతోంది.జగన్ అగ్రహానికి ప్రధాన కారణం లిక్కర్ స్కామ్ వ్యవహారమేనని పార్టీ వర్గాలు నమ్ముతున్నాయి. పాలనలో మద్యం విధానం రూపకల్పన, డిస్టిలరీల వ్యవహారాల్లో చెవిరెడ్డి కీలక పాత్ర పోషించారని, అయితే ఆ ప్రక్రియలో జగన్ రెడ్డికి, పార్టీకి తెలియకుండా పెద్ద ఎత్తున నిధులు మళ్లించి, తన స్వప్రయోజనాల కోసం డబ్బులు మిగుల్చుకున్నారని సిట్ లెక్కల్లో తేలింది. మద్యం కుంభకోణంలో సొంత మనుషులే తనను మోసం చేశారనే క్లారిటీ జగన్‌కు రావడంతో, చెవిరెడ్డి పట్ల ఉన్న నమ్మకం కాస్తా తీవ్ర అసంతృప్తిగా మారింది. ఆ దెబ్బతోనే ఆయనకు జగన్ దగ్గర ఎంట్రీ బంద్ అయిందనే వార్తలు వినిపిస్తున్నాయి.ఒకప్పుడు తాడేపల్లి ప్యాలెస్‌లో నిత్యం దర్శనమిచ్చే చెవిరెడ్డి, ఇప్పుడు కనీసం జగన్ పక్కన నిలబడే అర్హతను కూడా కోల్పోయినట్లయింది. గత కొన్ని నెలలుగా జగన్ మీడియా సమావేశాల్లో కానీ, ముఖ్యమైన పార్టీ సమావేశాల్లో కానీ ఆయనెక్కడా కనిపించకపోవడం ఈ ఊహాగానాలకు బలాన్ని చేకూరుస్తోంది. వచ్చే ఎన్నికల్లో చెవిరెడ్డికి తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తరఫున టికెట్ దక్కే అవకాశాలు దాదాపు శూన్యమని పొలిటికల్ కారిడార్‌లో టాక్ నడుస్తోంది. పరిస్థితిని బట్టి చంద్రగిరి నియోజకవర్గం నుంచి ఆయన కుమారుడు మోహిత్ రెడ్డికి ఏమైనా అవకాశం కల్పిస్తారా అంటే.. అప్పటివరకు ఉండే రాజకీయ సమీకరణాలు, జగన్ ఆలోచనా విధానాన్ని బట్టి అది కూడా అనుమానాస్పదమేనని తెలుస్తోంది.సజ్జల వర్గం గనుక చెవిరెడ్డిని మరింతగా టార్గెట్ చేస్తే, ఆయన ఇక వైసీపీలో మనుగడ సాగించడం అసాధ్యమనే భావనకు పార్టీ శ్రేణులు వస్తున్నాయి. జగన్ దయ కోల్పోయిన నాయకుడికి వైసీపీలో భవిష్యత్తు లేదనేది బహిరంగ సత్యం. కష్టకాలంలో పార్టీకి అండగా ఉండాల్సిన నాయకుడే నమ్మకద్రోహం' చేశాడనే ముద్ర పడటంతో, చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి రాజకీయ జీవితానికి గండం తెచ్చి పెట్టింది. సజ్జల వ్యూహాలకు బలైపోతున్న చెవిరెడ్డి, వైసీపీని వీడి వేరే దారి చూసుకుంటారా లేక రాజకీయంగా మౌనం పాటిస్తూ కాలానికి వదిలేస్తారా అనేది వేచి చూడాల్సిందే. ఏది ఏమైనా, వైఎస్ జగన్ సొంత గుడారంలో చెవిరెడ్డి చాప్టర్ దాదాపు ముగింపునకు వచ్చిందనేది ఎక్కువ మంది నమ్ముతున్న అంశం.

‘మీభూమి-బ్లాక్ చెయిన్’

విజయవాడ జూలై 25, భూ రికార్డుల నిర్వహణలో సాంకేతిక విప్లవానికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శ్రీకారం చుడుతోంది. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో విడివిడిగా ఉన్న భూ సమాచారాన్ని ఒకే వేదికపైకి తీసుకువస్తూ, రాష్ట్రంలోని భూ రికార్డులకు సింగిల్ సోర్స్ ఆఫ్ ట్రూత్‌గా నిలిచే 'మీభూమి?బ్లాక్ చెయిన్' వ్యవస్థను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల కలెక్టర్లు వర్చువల్‌గా ఈ కార్యక్రమంలో పాల్గొంటారు. ప్రస్తుతం వెబ్‌ల్యాండ్ ద్వారా భూ రికార్డులు డిజిటలైజ్ అయినప్పటికీ, రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖల్లో సమాచారం వేర్వేరుగా ఉండటం వల్ల డేటా వ్యత్యాసాలు, రికార్డుల్లో మార్పులను గుర్తించడంలో సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ సమస్యలకు శాశ్వత పరిష్కారంగా మీ భూమి?బ్లాక్ చెయిన్ వ్యవస్థను రూపొందించారు. ఐఎఅ ఆంధ్రప్రదేశ్, ఐఎఅ బెంగళూరులోని సెంటరాఫ్ ఎక్స్ లైన్స్ ఇన్ బ్లాక్ చెయిన్ టెక్నాలజీ సంస్థలు సంయుక్తంగా హైపర్ లెడ్జర్ ఫ్యాబ్రిక్ టెక్నాలజీతో ఈ వ్యవస్థను అభివృద్ధి చేశాయి. ఈ వ్యవస్థలో ప్రతి భూ పార్సెల్‌కు ప్రత్యేక బ్లాక్‌చెయిన్ గుర్తింపు కల్పిస్తారు. ప్రతి లావాదేవీ టాంపర్-ప్రూఫ్, సెక్యూర్టీతో జరగనుంది. భూ రికార్డుల్లో ఎలాంటి మార్పు చేయాలన్నా ప్రభుత్వం నిర్దేశించిన ఆన్‌లైన్ సేవల ద్వారానే ఇకపై సాధ్యమవుతుంది. ఒక భూ పార్సెల్‌కు సంబంధించిన అన్ని రకాల లావాదేవీలు, వాటి ప్రతి వెర్షన్ సహా శాశ్వతంగా నమోదయ్యేలా వ్యవస్థను తీర్చిదిద్దారు. ఇక ప్రతి లావాదేవీని ఏ అధికారి, ఎప్పుడు నిర్వహించారనే వివరాలు కూడా శాశ్వతంగా రికార్డుల్లో ఉంటాయి. రికార్డుల్లో ఏమైనా వ్యత్యానం ఉంటే లావాదేవీ వెంటనే ఆగిపోయేలా వ్యవస్థను రూపొందించారు. రెవెన్యూ, సర్వే, రిజిస్ట్రేషన్ శాఖలను ఒకే వేదికపైకి తీసుకువస్తున్న ఈ వ్యవస్థలో ప్రస్తుతం ఆటో మ్యూటేషన్, సబ్-డివిజన్, ఎక్స్‌టెంట్ కరెక్షన్ సహా ఎనిమిది పౌర సేవలు అందుబాటులోకి వస్తున్నాయి. వ్యవసాయం, మత్స్యశాఖ, గనులు, పరిశ్రమలు, విద్యుత్ శాఖ, సీఆర్‌డీఏ, ఆర్థిక సంస్థలు వంటి విభాగాలు కూడా అవసరమైన మేరకు ఈ సమాచారాన్ని వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. మొదటి దశలో కర్నూలు, చిత్తూరు, బాపట్ల, కృష్ణా, తూర్పుగోదావరి, పార్వతీపురం మన్యం, విజయనగరం జిల్లాల పరిధిలోని అస్పరి, పెనుమూరు, రేపల్లె, గన్నవరం, కడియం, గుమ్మలక్ష్మీపురం, కొత్తవలస మండలాల్లో ఈ పైలట్ ప్రాజెక్టుగా అమలుకానుంది. ఈ పైలట్ ప్రాజెక్టులో 89 రీ-సర్వే గ్రామాలు, 1,37,763 ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లు కవర్ అవుతున్నాయి.



ప్రత్యక్ష ఎన్నికల దిశగా అడుగులు

విజయవాడ, జూలై 25, ఆంధ్రప్రదేశ్ రాజకీయం త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల వేళ ఓ భారీ మలుపు తిరగబోతోంది. స్థానిక సంస్థల్లో ఏళ్ల తరబడి శాపంగా మారిన క్యాంప్ రాజకీయాలు , బేరసారాలు, బెదిరింపులకు శాశ్వతంగా చరమగీతం పాడేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అత్యంత కీలకమైన ప్రజాస్వామ్య సంస్కరణకు రూపకల్పన చేస్తున్నారు. మేయర్లు, మున్సిపల్ చైర్మన్లు, జిల్లా పరిషత్ (చైర్మన్లు, మండల పరిషత్ అధ్యక్షులను ప్రజలే నేరుగా ఎన్నుకునే ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని పునరుద్ధరించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. పరోక్ష ఎన్నికల పేరిట స్థానిక సంస్థల్లో సాగుతున్న ప్రజాస్వామ్య హననాన్ని అరికట్టడమే లక్ష్యంగా ఈ నిర్ణయం తీసుకోబోతున్నట్లు భావిస్తున్నారు.పరోక్ష ఎన్నికల విధానంలో గ్రామ, వార్డు స్థాయి ప్రజాప్రతినిధులను ఎన్నుకున్న తర్వాత, వారు తమ నాయకుడిని ఎన్నుకుంటారు. ఈ క్రమంలో అధికార బలం, ఆర్థిక ప్రాబల్యం, పోలీసు వ్యవస్థ దుర్వినియోగం పీక్ స్టేజ్‌కు చేరుకుంటాయి. మెజార్టీ రాని అధికార పార్టీలు కూడా ప్రతిపక్షాల నుంచి గెలిచిన ప్రజాప్రతినిధులను రిసార్టులకు తరలించడం, క్యాంపులు నిర్వహించడం, రకరకాల ఒత్తిళ్లకు గురిచేసి తమవైపు తిప్పుకోవడం ఆనవాయితీగా మారింది. చివరికి ప్రజల తీర్పు ఒకటైతే, పీఠంపై కూర్చునేది మరొకరయ్యే పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ అక్రమ సంస్కృతికి అడ్డుకట్ట వేయాలంటే ప్రజల చేతికే నేరుగా ఓటు హక్కు ఇవ్వడమే ఏకైక మార్గమని భావిస్తున్నారు.సాధారణంగా ఏ అధికార పార్టీ కూడా ఇటువంటి ప్రత్యక్ష ఎన్నికల విధానాన్ని తీసుకురావడానికి సాహసించదు. ఎందుకంటే, పరోక్ష విధానం ఉంటే వార్డుల్లో సీట్లు తగ్గినా, సర్పంచ్ లేదా కౌన్సిలర్లను లొంగదీసుకుని మున్సిపాలిటీలు, జడ్పీలను కైవసం చేసుకునే వెసులుబాటు అధికారంలో ఉన్న పార్టీకి ఉంటుంది. అయితే, అక్రమ మార్గాల్లో పీఠాలను దక్కించుకునే సంస్కృతి కంటే, పారదర్శకమైన ప్రజా తీర్పుకే ప్రాధాన్యత ఇవ్వాలనేది సీఎం చంద్రబాబు వ్యూహంగా కనిపిస్తోంది. పరోక్ష ఎన్నికల్లో జరిగే కోట్లాది రూపాయల బేరసారాలకు స్వస్తి పలికితే, స్థానిక సంస్థల్లో జవాబుదారీతనం పెరుగుతుందనేది నమ్మకం.గత చరిత్రను పరిశీలిస్తే.. ఆంధ్రప్రదేశ్‌లో స్థానిక సంస్థలకు ప్రత్యక్ష ఎన్నికలు నిర్వహించడం ఇదే మొదటిసారి కాదు. 1987లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో దివంగత ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు హయాంలో తొలిసారిగా మున్సిపల్ చైర్మన్లు, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులకు నేరుగా ప్రజలే ఓటు వేసే విధానాన్ని ప్రవేశపెట్టారు. ఆ తర్వాత 2000వ దశకం ప్రారంభంలో చంద్రబాబు హయాంలోనూ మేయర్లు, మున్సిపల్ చైర్మన్లను నేరుగా ఎన్నుకునే పద్ధతి నడిచింది. అయితే, కౌన్సిల్‌లో ఒక పార్టీకి మెజార్టీ ఉండి, మేయర్, చైర్మన్ మరొక పార్టీకి చెందినవారు గెలిస్తే పాలనలో ప్రతిష్టంభన ఏర్పడుతోందనే నెపంతో తర్వాతి ప్రభుత్వాలు మళ్లీ పరోక్ష విధానానికే మొగ్గు చూపాయి.చట్టపరమైన కోణంలో చూస్తే.. భారత రాజ్యాంగంలోని 243అ పంచాయతీలు, 243ఖీ మున్సిపాలిటీలు నిబంధనల ప్రకారం స్థానిక సంస్థల అధ్యక్షుల ఎన్నికల విధానాన్ని నిర్ణయించే సర్వాధికారాలు రాష్ట్ర శాసనసభలకే ఉన్నాయి. దీనికోసం ఆంధ్రప్రదేశ్ పంచాయతీ రాజ్ చట్టం-1994 , అలాగే ఆంధ్రప్రదేశ్ మున్సిపాలిటీల చట్టం-1965 , మున్సిపల్ కార్పొరేషన్ల చట్టం-1994లకు అసెంబ్లీలోసవరణలు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుత కూటమికి అసెంబ్లీలో అత్యధిక మెజార్టీ ఉన్నందున,ఈ చట్టసవరణ చేయడం ప్రభుత్వానికి సునాయాసమైన ప్రక్రియే కానుంది.ఈ ప్రత్యక్ష విధానం అమల్లోకి వస్తే రాజకీయ పార్టీలపై, స్థానిక నాయకత్వంపై తీవ్ర ప్రభావం పడనుంది. కేవలం డబ్బు సంచులతో కౌన్సిలర్లనుకొనుగోలుచేసే ధనస్వామ్య నాయకులకు కాలం చెల్లి, ప్రజల్లో మంచి గుర్తింపు, ఆమోదయోగ్యత ఉన్న నాయకులకే పార్టీలు బీ-ఫారాలు ఇవ్వాల్సి వస్తుంది.ఒక వేళ కౌన్సిల్‌లో ప్రతిపక్షాల బలం ఎక్కువగా ఉన్నా, ప్రజల చేత నేరుగా ఎన్నుకోబడిన మేయర్, చైర్మన్ బడ్జెట్ ఆమోదం, పాలనా నిర్ణయాల్లో అందరినీ సమన్వయం చేసుకుంటూ వెళ్లాల్సి ఉంటుంది. అధికారంలో ఉండి కూడా పరోక్ష లబ్ధిని వదులుకుని ప్రత్యక్ష ఎన్నికలకు వెళ్లడం ఒక రాజకీయ తెగువగా అభివర్ణించవచ్చు. ఈ ప్రతిపాదన గనుక చట్టరూపం దాల్చి అమల్లోకి వస్తే, భవిష్యత్తులో దేశంలోని ఇతర రాష్ట్రాలకు కూడా ఆంధ్రప్రదేశ్ స్థానిక పాలనలో మార్గదర్శిగా నిలిచే అవకాశాలు మెండుగా ఉన్నాయి

అమర్ రాజా చుట్టూ రాజకీయం

గుంటూరు జూలై 25,తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లా దివిటిపల్లి గిగా కారిడార్‌లో అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సంస్థకు చెందిన అడ్వాన్స్‌డ్ కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ విజయవంతంగా ప్రారంభమవ్వడం పక్కనే ఉన్న ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో తీవ్ర కలకలం రేపింది. నాలుగు దశాబ్దాలుగా చిత్తూరు నేలను కేంద్రంగా చేసుకుని ఎదిగిన ఒక స్వదేశీ దిగ్గజ సంస్థ, ఏకంగా 9,500 కోట్ల భారీ పెట్టుబడితో నిర్మించే లిథియం-అయాన్ గిగాఫ్యాక్టరీ ప్రాజెక్టును పొరుగు రాష్ట్రానికి తరలించాల్సి రావడంపై ఏపీలో రాజకీయం ప్రారంభమయింది. ఈ పరిణామాన్ని ఆంధ్రప్రదేశ్ ఆర్థిక రంగానికి జరిగిన తీరని లోటుగా అభివర్ణిస్తూ, తెలుగుదేశం పార్టీ గతాన్ని తవ్వి తీస్తూ వైఎస్సార్‌సీపీపై తీవ్రంగా విమర్శలు చేస్తోంది. ఈ ప్రారంభోత్సవం వెనువెంటనే ఏపీ విద్యా, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ సామాజిక మాధ్యమాల వేదికగా చేసిన ప్రకటన ఏపీ రాజకీయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హయాంలో అమరరాజా సంస్థపై సాగిన రాజకీయ కక్షసాధింపు చర్యలు, వేధింపుల కారణంగానే రాష్ట్రం ఒక చారిత్రక పారిశ్రామిక అవకాశాన్ని కోల్పోయిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అమరరాజా ఛైర్మన్ గల్లా జయదేవ్ కుటుంబానికి ఏపీ సమాజం క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితిని గత ప్రభుత్వం తెచ్చిపెట్టిందని, నాటి జగన్ రెడ్డి సర్కార్ అవలంబించిన విధ్వంసకర విధానాలే ఈ ప్రాజెక్ట్ తెలంగాణ పాలమూరు రంగానికి వెళ్లడానికి కారణమని లోకేష్ తో పాటు టీడీపీ శ్రేణులు తీవ్రస్థాయిలో విమర్శలు ప్రారంభించాయి. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అమరరాజా గ్రూప్‌ను రాజకీయ లక్ష్యంగా చేసుకుని తీవ్ర ఇబ్బందులకు గురిచేశారన్న ఆరోపణలుఉన్నాయి. గల్లా జయదేవ్ టీడీపీ ఎంపీగా ఉండటంతో, పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ ద్వారా ప్లాంట్ల మూసివేత నోటీసులు ఇవ్వడం, విద్యుత్ , నీటి సరఫరాను అడ్డుకోవడం, కేటాయించిన 253 ఎకరాల పారిశ్రామిక భూములను రద్దు చేసేందుకు ప్రయత్నించడం వంటి చర్యలు చోటుచేసుకున్నాయి. ఈ తీవ్ర ఒత్తిళ్లు, అనిశ్చితి వాతావరణాన్ని తట్టుకోలేకనే అమరరాజా తన భవిష్యత్ విస్తరణ అయిన లిథియం-అయాన్ ఈవీ బ్యాటరీ క్లస్టర్‌ను తెలంగాణకు తరలించాల్సి వచ్చిందని పారిశ్రామిక నిపుణులు సైతం విశ్లేషిస్తున్నారు.ఈ మొత్తం వ్యవహారంలో ఒకరి నష్టం మరొకరికి లాభంగా మారింది. ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ యువతకు రావాల్సిన వేలాది ఉద్యోగాలు, రాష్ట్రానికి దక్కాల్సిన కోట్ల రూపాయల పన్ను ఆదాయం నేడు తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాకు దక్కాయి. తెలంగాణ ప్రభుత్వం సమకూర్చిన అనుకూల వాతావరణంతో దివిటిపల్లి వద్ద అమరరాజా తన ఆసియాలోనే అతిపెద్ద గిగాఫ్యాక్టరీల్లో ఒకదానిని సాకారం చేసుకుంటోంది. చిత్తూరు ప్రాంతంలో ఉపాధి ఆశలు అడుగంటిపోగా, పొరుగు రాష్ట్రం గ్రీన్ ఎనర్జీ హబ్‌గా మారడంపై రాయలసీమ ప్రజల్లోనూ, వ్యాపార వర్గాల్లోనూ తీవ్ర అసంతృప్తి నెలకొంది. ప్రస్తుతం ఏపీలోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి ప్రభుత్వం ఈ అంశాన్ని ఒక పదునైన కేస్ స్టడీగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు పక్కా వ్యూహం సిద్ధం చేసింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవలంబించిన కక్షసాధింపు పారిశ్రామిక విధానాలు ఎవరికీ శ్రేయస్కరం కావని, దాంతో రాష్ట్ర ప్రతిష్ట ఏ విధంగా దెబ్బతిన్నదో వివరించడానికి జిల్లాల వారీగా ప్రచారానికి సిద్ధమవుతోంది. గతం గడిచిపోయినా.. అమరరాజా గ్రూప్ ఏపీలో చేపట్టబోయే ఏ ఇతర నూతన విస్తరణ ప్రాజెక్టులకైనా తమ ప్రభుత్వం ఎర్ర తివాచీ పరుస్తుందని, పూర్తి సహకారాన్ని అందిస్తుందని నారా లోకేష్ పునరుద్ఘాటించారు. కేవలం ఒక్క అమరరాజాయే కాకుండా, గతంలో రాష్ట్రం నుంచి బయటకు వెళ్లిపోయిన సుజలాన్, ఫాక్స్‌కాన్ అసెంబ్లీ యూనిట్లు, ఇతర చిన్న-తరహా పరిశ్రమల నిర్వాహకులకు మళ్లీ భరోసా కల్పిస్తూ ఏపీలో పారిశ్రామిక పునరుజ్జీవనానికి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో ఇది 'జగన్ మార్క్ పాలనా వైఫల్యం'పై పోరాటానికి టీడీపీకి దొరికిన బలమైన ఆయుధంగా మారింది. రాబోయే రోజుల్లో ఈ పారిశ్రామిక రాజకీయం ఏపీలో మరింత వేడెక్కడం ఖాయంగా కనిపిస్తోంది.

ఆర్గానిక్ బాటలో జగన్

ఏలూరు జూలై 25,డిజిటల్ ప్రపంచంలో పెయిడ్ ట్రాఫిక్ కోసం చాలా మంది డబ్బులు కడుతూంటారు. తమ పోస్టులకు రీచ్ రావడానికి.. తాము చేసే ప్రకటనల్ని ఎక్కువ మంది చూడటానికి.. తమ వీడియోలను ఎక్కువ మంది చూడటానికి డబ్బులు కడుతూంటారు. అయితే నిజానికి అలా కట్టడం వల్ల ఎక్కువ మంది చూడరు. నెంబర్స్ మాత్రమే కనిపిస్తాయి. అంటే ప్రయోజనం కనిపిస్తుంది కానీ.. పనికి రాదు. జగన్ రెడ్డి కూడా అదే మార్క్ రాజకీయాలు చేస్తున్నారు. పూర్తిగా పెయిన్ పాలిటిక్స్ చేస్తూ?ఆర్గానిక్ బాటను మర్చిపోయారు.రాజకీయ నాయకుడు ఏదైనా కార్యక్రమం చేస్తే ప్రజల భాగస్వామ్యం ఉండేలా చేసుకోవాలి. ముఖ్యంగా క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న



నిజమైన, సహజమైన సమస్యలను పట్టుకుని బాధితుల మధ్యకు వెళ్తున్నప్పుడు వారిని కలవాలి. కానీ జగన్ రెడ్డి ఆ సమస్య పేరుతో తాను ఓ డ్రామా సృష్టించుకుని దానిలో నటించి వెళ్లిపోతారు. సమస్య ఏదైనా సరే, దాని చుట్టూ కొంతమంది నేతలతో ఒక ఆర్టిఫిషియల్ డ్రామా నడిపిస్తే చాలు రాజకీయం చేయవచ్చని జగన్ భావిస్తున్నారని, కానీ ఈ వ్యూహం ప్రజల్లో ఆయన నమ్మకాన్ని మరింత దిగజారుస్తోంది.ఇటీవల అక్వా రైతులు తీవ్రమైన సంక్షోభంలో ఉన్నారంటూ వైఎస్సార్‌సీపీ పెద్ద ఎత్తున హడావుడి చేసింది. అయితే, క్షేత్రస్థాయిలో అక్వా రైతుల వద్దకు వెళ్లి వారి బాధలు వినకుండా.. ఫేక్ సభ పెట్టి .. పార్టీ నేతలతో మాట్లాడి డ్రామా పాలిటిక్స్ చేశారు. ఈ పోరాటం ఏ ఒక్క అసలైన అక్వా రైతునూ కదిలించలేకపోయింది. ఇప్పుడు అదే తరహా మైండ్ గేమ్ పొగాకు రైతుల విషయంలోనూ పునరావృతమవుతోంది. అసలైన రైతులతో కనెక్ట్ కాకుండా, కేవలం కెమెరాల ముందూ, ముందస్తుగా సిద్ధం చేసిన స్క్రిప్ట్‌ల చుట్టూ రాజకీయాలు నడపడం వల్ల ప్రతిపక్షంగా సాధించే ప్రయోజనమేమీ లేకుండా పోతోంది.ఈ శైలి వెనుక జగన్ ఎదుర్కొంటున్న ఓ రకమైన ఆత్మన్యూనతా భావం ఉంది. తాను బయటకు వెళ్తే జనాలు రారేమో, భద్రత లేదా ఆదరణ విషయంలో వ్యతిరేక సంకేతాలు వెళ్తాయేమో అనే ముందస్తు భయంతోనే ఆయన కృత్రిమ వాతావరణాన్ని, సొంత పార్టీ క్యాడర్‌తో సభలను ఏర్పాటు చేసుకుని రాజకీయం మమేకం చేస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రజాకర్షణ ఉన్న నాయకుడిగా పేరొందిన జగన్.. ఇలా ఆర్టిఫిషియల్ పరిమితులకు పరిమితం కావడం వెనుక సజ్జల రామకృష్ణారెడ్డి వంటి సలహాదారుల బ్రెయిన్ వాష్ ప్రభావం చాలా ఉందనేది సొంత పార్టీ నేతల ఆవేదన. కానీ జగన్ రాజకీయం అంటే డ్రామాలే అని గట్టిగా నమ్ముతున్నారు.

పంట కాలువలో ముగ్గురు దుర్మరణం

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ రామచంద్రపురం మండలం వెంకటపాలెం గ్రామ సమీపంలోని పంట కాలువలో స్నానానికి దిగిన ముగ్గురు చిన్నారులు ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందిన విషాద ఘటన చోటుచేసుకుంది.ఈ ఘటనలో కనికెళ్ళ రంజిత్ కుమార్(15), బొక్క వీరేంద్ర(18), వేమన పావని(15) మృతి చెందారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రామచంద్రపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.మృతులు కపిలేశ్వరపురం మండలం అంగర, పడమర ఖండ్రిక, తాతపూడి గ్రామాలకు చెందినవారు. వీరు అక్కాచెల్లెళ్ల పిల్లలు కాగా ప్రస్తుతం హైదరాబాద్ లో నివసిస్తున్నారు. రామచంద్రపురం మండలం వెలంపాలెం గ్రామంలోని అమ్మ ఇంటికి నిన్న జరిగిన తాతయ్య సంస్కార కార్యక్రమానికి హాజరయ్యేందుకు వచ్చారు. ఈరోజు సమీపంలోని వెంకటపాలెం పంట కాలువలో స్నానానికి వెళ్లి ఈ ప్రమాదానికి గురయ్యారు.ఈ విషయం తెలుసుకున్న రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్, మాజీ రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్ సంఘటనా స్థలానికి చేరుకుని మృతుల కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు మంత్రి సుభాష్ తమ ప్రగాఢ సానుభూతిని, సంతాపాన్ని తెలియజేశారు.ఈ ఘటనతో వెలంపాలెం గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

సింహాచలం అప్పన్న స్వామిని దర్శించుకున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

స్వామి వారి దయతో కూటమి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి

విశాఖపట్నం,క్రీడాశాఖల మంత్రి మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అప్పన్న స్వామిని దర్శించుకున్నారు. . ఆలయ మర్యాదలతో మంత్రికి ఖూ వెంకట్రావు, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీవాసచార్యులు పూర్ణకుంభంతో మర్యాదపూర్వక స్వాగతం పలికారు మండపంలో రాతి సానలపై చందనం చెక్కలను గంధం అరగదీసారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య మంత్రికి ఆశీర్వచనం అందించి, తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్వామి వారి దయతో కూటమి ప్రభుత్వ హయాంలో ఉత్తరాంధ్ర అభివృద్ధి సాగిస్తోందని రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం మంత్రి స్వామివారిని ప్రార్థించారు.

ఉండవల్లి లో కొవ్వొత్తుల ర్యాలీ

ఉండవల్లి సెంటర్ నీట్ పేపర్ లీకేజీ కి వ్యవహారంపై ఢిల్లీ లో జంతర్ మంతర్ దగ్గర తమ ఆందోళన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు జరిపిన లాఠీ చార్జి కి నిరసనగా రాష్ట్ర రైతు సంఘం ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు ఉండవల్లి సెంటర్లో జరిగిన ఈ ర్యాలీలో రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ పేపర్ లీకేజ్ అనేది ఒక హేయమైన చర్య యువత భవిష్యత్తుతో చలగాటం ఆడుతున్న ఈ ప్రభుత్వానికి రాబోయే రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్తారని పేపర్ లీకేజీ కి బాధ్యత వహిస్తూ తక్షణమే విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన రైతు సంఘం నాయకులు ×ఈ కార్యక్రమంలో ఏపీరైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు జొన్న శివ శంకర్, రైతు సంఘం కోశాధికారి నూరి నారాయణ,రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులుయు రాజశేఖర్,యుటిఎఫ్ గుంటూరు జిల్లా అధ్యక్షులు ఏం రవి, సిఐటియు గుంటూరు జిల్లా నాయకులు కే జగదీశ్వర్ రెడ్డి, రైతు సంఘం రాజధాని డివిజన్ కార్యదర్శి డి శ్రీనివాస కుమారి, మహిళా సంఘం రాష్ట్ర ఉ పాధ్యక్షురాలు డి వెంకట్ రెడ్డి, రైతు సంఘం తాడేపల్లి రూరల్ నాయకులు బూరుగ వెంకటేశ్వర్లు, సిఐటియు జిల్లా నాయకులు మరియు రైతులు పాల్గొన్నారు

స్పోర్ట్స్ న్యూస్

కామన్‌వెల్త్ గేమ్స్‌లో భారత్ బోణీ..



అచిఉ-2026 : కామన్వెల్త్ గేమ్స్-2026 (అచిఉ-2026) లో భారత్ బోణీ కొట్టింది. పారా పవర్‌లిఫ్టర్ జండు కుమార్) దేశానికి తొలి పతకాన్ని అందించాడు. శనివారం రాత్రి జరిగిన పురుషుల హెవీవెయిట్ కేటగిరీ పోటీల్లో కాంస్య) పతకాన్ని కైవసం చేసుకున్నాడు. 72.4 కిలోల బరువున్న జండు కుమార్ తన రెండో ప్రయత్నంలో 190 కిలోల బరువును విజయవంతంగా ఎత్తి పతకాన్ని ఖాయం చేసుకున్నాడు. మూడో ప్రయత్నంలో 196 కిలోలు ఎత్తడంలో స్వల్ప తేడాతో విఫలమయ్యాడు. పోటీల్లో చాలాసేపు ఆధిక్యంలో ఉన్నప్పటికీ చివరికి మూడో స్థానంలో నిలిచి కాంస్యంతో సరిపెట్టుకున్నాడు.బీహార్‌లోని నలందా జిల్లా హర్నాత్ గ్రామానికి చెందిన జండు కుమార్ ప్రస్థానం ఎంతో స్ఫూర్తిదాయకమని చెప్పవచ్చు. ఓ సాధారణ కూరగాయల వ్యాపారి కుమారుడైన జండు.. పుట్టుకతోనే పోలియో బారినపడ్డాడు. అయినప్పటికీ ఎన్నో శారీరక, ఆర్థిక సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ క్రీడా వేదికపై నిలిచాడు. ఆసక్తికరంగా జండు క్రీడా జీవితం పవర్‌లిఫ్టింగ్‌తో మొదలుకాలేదు. 2017లో షాట్‌పుట్, డిస్కస్ త్రో అథ్లెట్‌గా కెరీర్ ప్రారంభించి జిల్లా, రాష్ట్ర స్థాయి పతకాలు కూడా సాధించాడు. జిమ్‌లో శిక్షణ తీసుకుంటున్నప్పుడు పవర్‌లిఫ్టింగ్‌పై ఆసక్తి పెంచుకుని ఆ తర్వాత ఈ క్రీడలోకి మారాడు.

అయితే అతని ప్రయాణం అంత సులువుగా సాగలేదు. ఉన్నతస్థాయి పోటీలకు అవసరమైన పోషకాహారం కూడా కొనుగోలు చేయలేని దుస్థితిలో జీవనోపాధి కోసం కూరగాయల వ్యాపారం నడిపారు. కనీసం వీల్‌చైర్ కూడా లేని స్థితిలో రోజూ 20 కిలోమీటర్లు ప్రయాణించి స్థానిక మార్కెట్లకు వెళ్లేవాడు. స్నేహితుల వద్ద అప్పు చేసి కొన్న ఈ-రిక్షాతో చేసిన కూరగాయల వ్యాపారం కూడా అప్పట్లో కరోనా మహమ్మారి కారణంగా దెబ్బతిన్నది.ఇలాంటి క్లిష్ట పరిస్థితుల్లో పారాలింపిక్ కాంస్య పతక విజేత రాజిందర్ సింగ్ రహేలు.. జండులోని ప్రతిభను గుర్తించాడు. గాంధీనగర్‌లోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాంఎ) సెంటర్‌లో శిక్షణకు ఆహ్వానించాడు. రాజిందర్ మార్గదర్శకత్వంలో జండు కుమార్ అద్భుతంగా రాటుదేలాడు. 2025 జాతీయ ఛాంపియన్‌షిప్‌లో 205 కిలోలు ఎత్తి జాతీయ రికార్డు సృష్టించాడు. కొద్ది నెలలకే ఖేలో ఇండియా పారా గేమ్స్‌లో 206 కిలోలు ఎత్తి తన రికార్డును తానే బద్దలుకొట్టాడు.ఈ కామన్వెల్త్ పతకానికి ముందు బీజింగ్ ప్రపంచకప్ (2025), ఆసియా ఛాంపియన్‌షిప్ (2026) లలోనూ కాంస్య పతకాలు గెలుచుకుని తన సత్తా చాటుకున్నాడు

ఝుండూ కుమార్‌కు మోదీ అభినందనలు



గ్లాస్గో వేదికగా జరుగుతున్న కామన్వెల్త్ గేమ్స్ 2026లో భారత్ పతకాల ఖాతా తెరిచింది. బిహార్‌కు చెందిన పారా అథ్లెట్ ఝుండూ కుమార్ భారత్‌కు తొలి పతకాన్ని అందించాడు. పురుషుల హెవీవెయిట్ పారా పవర్ లిఫ్టింగ్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు. కాగా ఈ విజయంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. అతడికి అభినందనలు తెలిపారు.'కామన్వెల్త్ గేమ్స్ 2026లో హెవీవెయిట్ పారా పవర్ లిఫ్టింగ్‌లో కాంస్య పతకం సాధించిన ఝుండూ కుమార్ ప్రదర్శన అద్భుతం. ఆయనకు నా హృదయపూర్వక అభినందనలు. అపారమైన శక్తి, సంకల్పం, ఎన్నో ఏళ్ల క్రమశిక్షణతో కూడిన సాధనకు ఈ విజయం నిదర్శనం. ఎదురైన అన్ని సవాళ్లను అధిగమించి అంతర్జాతీయ వేదికపై దేశ ప్రతిష్ఠను నిలబెట్టారు. ఆయన విజయం కోట్లాది మంది భారతీయులకు స్ఫూర్తిగా నిలుస్తుంది' అని మోదీ ఎక్స్‌లో పేర్కొన్నారు.ఈ పోటీలో 190 కిలోల బరువును ఎత్తిన ఝుండూ.. 130.9 పాయింట్లతో మూడో స్థానంలో నిలిచాడు. ఫైనల్‌లో తొలి ప్రయత్నంలో 181 కిలోల బరువును సునాయసంగా ఎత్తిన అతడు.. రెండో ప్రయత్నంలో 190 కిలోలను లిఫ్ట్ చేశాడు. కానీ చివరి ప్రయత్నంలో 196 కిలోల బరువును ఎత్తేందుకు ప్రయత్నించి విఫలమయ్యాడు. దీంతో కాంస్య పతకంతో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. నైజీరియాకు చెందిన రిలువాన్ ఇద్రిస్ 132.8 పాయింట్లతో స్వర్ణ పతకం కైవసం చేసుకోగా, ఇంగ్లండ్‌కు చెందిన మాథ్యూ హార్డింగ్ 131.0 కిలోలతో రజత పతకం దక్కించుకున్నాడు. కేవలం 0.1 కిలో తేడాతో ఝుండూ రజత పతకాన్ని చేజార్చుకోవడం గమనార్హం.

గంభీర్ విధానంపై అశ్విన్ విమర్శలు..
టీమ్‌లో స్పష్టత అవసరమని వ్యాఖ్య



2027 వన్డే ప్రపంచకప్ కోసం భారత జట్టు సన్నద్ధమవుతున్న వేళ.. హెడ్‌కోచ్ గౌతమ్ గంభీర్ అమలు చేస్తున్న సెలక్షన్ విధానంపై టీమ్‌ఇండియా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్ విమర్శలు గుప్పించాడు. ప్రస్తుతం జట్టులో పూర్తిస్థాయి ఆల్‌రౌండర్లకు బదులుగా.. అడపాదడపా రాణించే క్రికెటర్లపై ఆధారపడటం పెద్ద సమస్యగా మారిందని అభిప్రాయపడ్డాడు. ఇది ఏమాత్రం సరైన వ్యూహం కాదన్నాడు అశ్విన్.ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో భారత్ ఓటమి పాలైన నేపథ్యంలో అశ్విన్ పలు కీలక అంశాల గురించి మాట్లాడాడు. హార్దిక్ పాండ్యా ఫిట్‌నెస్ సమస్యలు జట్టుకు పెద్ద సవాలుగా మారాయని, అతనికి సరైన ప్రత్యామ్నాయాన్ని సిద్ధం చేయడంలో టీమ్ మేనేజ్‌మెంట్ విఫలమైందని పేర్కొన్నాడు. ప్రస్తుతం.. నితీశ్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే పేర్లు వినిపిస్తున్నప్పటికీ, గాయాల బెడద కారణంగా వారిపై పూర్తిస్థాయిలో ఆధారపడటం కష్టమేనన్నాడు. దీనికి 2023 వన్డే ప్రపంచకప్‌ను ఉదాహరణగా ప్రస్తావిస్తూ.. 'హార్దిక్ గాయపడిన సమయంలో నాటి కోచ్ రాహుల్ ద్రవిడ్ చక్కటి వ్యూహాన్ని అమలు చేశారు. ఆరో బౌలర్ కోసం వెతకలేదు. ఐదుగురు బౌలర్లతోనే జట్టును సమతూకంగా నడిపించి టీమ్‌ను ఫైనల్ వరకు తీసుకెళ్లగలిగారు' అని చెప్పుకొచ్చాడు. జట్టులోని ప్రతి ఆటగాడికీ తన పాత్రపై స్పష్టత ఉండటం ద్రవిడ్ విధానంలో ప్రధాన బలమని ఈ మాజీ స్పిన్నర్ వివరించాడు.'ప్రస్తుతం.. గౌతీ ఆధ్వర్యంలోని టీమ్ మేనేజ్‌మెంట్ అన్ని విభాగాల్లో నైపుణ్యం కలిగిన ఆటగాళ్లపై అతిగా దృష్టి సారిస్తోంది. దానివల్ల టెస్ట్ క్రికెట్‌లో కూడా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటోంది. టెస్టుల్లోనైనా, ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీల్లోనైనా మ్యాచ్ విజేతలుగా నిలిచే ప్రత్యేక నైపుణ్యం కలిగిన ఆటగాళ్లకే అధిక ప్రాధాన్యం ఇవ్వాలి' అని అశ్విన్ సూచించాడు. వరల్డ్ కప్ సన్నాహాల్లో భాగంగా.. తొలుత 17-18 మంది ప్లేయర్లతో ఒక స్థిరమైన జట్టును ఫిక్స్ చేసుకోవాలని అశ్విన్ సలహా ఇచ్చాడు. వచ్చే 14 నెలలపాటు వారినే రొటేషన్ పద్ధతిలో ఆడించాలన్నాడు. ఆ టీమ్‌లో ఇద్దరు వికెట్ కీపర్లు, ముగ్గురు స్పిన్నర్లు, ఐదుగురు పేసర్లు ఉండేలా ప్లాన్ చేసుకోవాలని చెప్పుకొచ్చాడు. ప్రపంచకప్ ఆరంభమయ్యే సమయానికి అత్యుత్తమ తుది జట్టును సిద్ధం చేయడమే లక్ష్యంగా ఉండాలని.. ప్రస్తుత జట్టు ఎంపికలో అలాంటి స్పష్టత లోపించిందని అశ్విన్ అభిప్రాయపడ్డాడు.

టాస్ గెలిచిన జింబాబ్వే.. టీ20ల్లో ఐపీఎల్ స్టార్ అరంగేట్రం..!



ఎజెఆ లబ జిఎఓ : జింబాబ్వే గడ్డపై టీ20 సిరీస్ క్లీన్‌స్వీప్‌పై కన్నేసిన భారత జట్టు రెండో మ్యాచ్‌కు సిద్ధమైంది. హరారే స్పోర్ట్స్ క్లబ్‌లో జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచిన సికిందర్ రజా బౌలింగ్ తీసుకున్నాడు. వరసగా ఎనిమిదిసార్లు టాస్ నెగ్గిన టీమిండియా సారథి శ్రేయాస్‌కు ఈసారి కలిసిరాలేదు. అయితే.. గత మ్యాచ్‌తో టీ20ల్లో అరంగేట్రం చేసిన పేసర్ అశోక్ శర్మకు తుది జట్టులో చోటు దక్కలేదు. అతడి స్థానంలో డెబ్యూ క్యాప్ అందుకున్న యశ్ ఠాకూర్ తుది జట్టులోకి వచ్చాడు.మూడు మ్యాచ్‌ల సిరీస్‌లో తొలి టీ20లో గెలుపొందిన భారత్ రెండో విజయంపై కన్నేసింది. రికార్డు స్థాయిలో టాస్ నెగ్గిన శ్రేయాస్ అయ్యర్.. ఈసారి ఓడిపోగా.. జింబాబ్వే బౌలింగ్ తీసుకుంది. సిరీస్‌లో నిలవాలంటే గెలవక తప్పని మ్యాచ్‌లో సికిందర్ రజా సేన సర్వశక్తులు ఒడ్డనుంది. టీమిండియా ఒక మార్పు చేయగా.. ఆతిథ్య జట్టు మాత్రం ఏ మార్పులు లేకుండా బరిలోకి దిగుతోంది.

జింబాబ్వే తుది జట్టు : బ్రియన్ బెన్నెట్, తడివనషె మరుమణి(వికెట్ కీపర్), బెన్ కర్రాన్, డియాన్ మయెర్స్, సికిందర్ రజా(కెప్టెన్), రియాన్ బురి, వెస్లీ మధీవరె, బ్రాడ్ ఎవాన్స్, న్యూమన్ న్యహుమ్రి, రిచర్డ్ నగరవ, బ్లెస్సింగ్ ముజరబని.


భారత తుది జట్టు : వైభవ్ సూర్యవంశీ, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్(వికెట్ కీపర్), శ్రేయాస్ అయ్యర్(కెప్టెన్), తిలక్ వర్మ, రింకూ సింగ్, శివం దూబే, రవి బిష్ణోయ్, ప్రిన్స్ యాదవ్, యశ్ ఠాకూర్, మయాంక్ యాదవ్.

లైంగిక వేధింపుల ఆరోపణలు..
ఐసీసీ చీఫ్ ప్రాసిక్యూటర్‌పై వేటు



: అంతర్జాతీయ క్రిమినల్ కోర్టులో తీవ్ర కలకలం రేగింది. లైంగిక వేధింపుల ఆరోపణల నేపథ్యంలో ఆ సంస్థ చీఫ్ ప్రాసిక్యూటర్ కరీం ఖాన్ ను పదవి నుంచి తొలగించారు. అత్యంత కీలకమైన హోదాలో ఉన్న వ్యక్తిపై ఇటువంటి చర్యలు తీసుకోవడం అంతర్జాతీయ స్థాయిలో చర్చనీయాంశం అయ్యింది. బ్రిటిష్ న్యాయవాది అయిన కరీం ఖాన్ ఐసీసీలో చీఫ్ ప్రాసిక్యూటర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. తనతో పనిచేసే ఓ మహిళా ఉద్యోగివట్ల ఆయన లైంగిక వేధింపులకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈ వ్యవహారంపై అంతర్గత విచారణ చేపట్టిన అనంతరం ఆయనను పదవి నుంచి తప్పించాలని తీర్మానం ప్రవేశపెట్టారు. ఐసీసీలో మొత్తం 125 సభ్యదేశాలు ఉండగా ఈ తీర్మానానికి మెజారిటీ దేశాలు ఆమోదం తెలిపాయి. దాంతో కరీం ఖాన్‌ను తక్షణమే విధుల నుంచి తొలగిస్తున్నట్లు ఐసీసీ అధికారికంగా ప్రకటించింది. అత్యున్నత పదవిలో ఉన్న వ్యక్తి లైంగిక ఆరోపణల కారణంగా ఉద్వాసనకు గురికావడం అంతర్జాతీయంగా పెను సంచలనం సృష్టించింది.

షమీని ఎవ్వరూ పట్టించుకోని స్థితికి తీసుకొచ్చారు: క్రిస్ శ్రీకాంత్



భారత సీనియర్ పేసర్ మహ్మద్ షమీ విషయంలో జట్టు యాజమాన్యం వ్యవహరిస్తున్న తీరుపై మాజీ కెప్టెన్ కృష్ణమాచారి శ్రీకాంత్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశాడు. ఒకప్పుడు భారత బౌలింగ్ దళానికి ప్రధాన అస్త్రంగా నిలిచిన షమీని ఇప్పుడు పూర్తిగా పక్కన పెట్టడం ఆశ్చర్యం కలిగిస్తోందని మండిపడ్డాడు. రానున్న వన్డే ప్రపంచ కప్ 2027కు భారత జట్టులో చోటు దక్కే ప్లేయర్ల గురించి చర్చిస్తున్న సందర్భంలో శ్రీకాంత్ ఈ వ్యాఖ్యలు చేశాడు.'ప్రిన్స్ యాదవ్, గుర్నూర్ బ్రార్, మొహ్సిన్ ఖాన్.. వీరంతా మంచి బౌలర్లు. ప్రపంచ కప్ టోర్నీకి ఇంకా 15 నెలల సమయం ఉంది. ఈ యువ ప్లేయర్లకు ఇప్పుడే పక్కన పెట్టలేం. కానీ షమీ అసాధారణ బౌలర్. అతడిని టీమ్ మేనేజ్‌మెంట్ ఎవ్వరూ పట్టించుకోని స్థితికి తీసుకొచ్చింది. ఇది నన్ను ఆశ్చర్యానికి గురిచేస్తోంది' అని క్రిస్ శ్రీకాంత్ వెల్లడించాడు. 2023 వన్డే ప్రపంచ కప్‌లో 24 వికెట్లతో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్‌గా నిలిచిన షమీ.. 2025 ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత భారత జట్టుకు ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. దేశవాళీ క్రికెట్‌లో రాణించినప్పటికీ ఏ సిరీస్‌కూ ఎంపిక కాకపోవడం చర్చనీయాంశంగా మారింది. బుమ్రా ఉంటేనే..2027 ప్రపంచ కప్‌లో భారత్ విజయావకాశాలు పూర్తిగా జస్ప్రీత్ బుమ్రా పైనే ఆధారపడి ఉంటాయని శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. 'బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్ చాలా కీలకం. అతడు భారత క్రికెట్‌కు దొరికిన అమూల్యమైన వజ్రం. బుమ్రా ఉంటేనే భారత్ ప్రపంచ కప్ గెలిచే అవకాశం ఉంటుంది. అతడు లేకపోతే మిగతా బౌలర్లతో అది చాలా కష్టం. అయితే దక్షిణాఫ్రికా పిచ్‌లపై ప్రసిద్ధ్ కృష్ణ, మహ్మద్ సిరాజ్ కూడా కీలక పాత్ర పోషించగలరు. అర్ష్‌దీప్ సింగ్‌కు తొలి రెండు ఓవర్లలో బంతి స్వింగ్ అయ్యే వరకు మాత్రమే ప్రభావం ఉంటుంది. ఆ తర్వాత అతడు పెద్దగా ప్రభావం చూపలేడు. ఇంగ్లండ్‌తో జరిగిన టీ20 సిరీస్‌లో కూడా తొలి ఓవర్ అద్భుతంగా వేసినా.. ఆ తర్వాత బ్యాటర్లు అతడిపై పూర్తిగా ఆధిపత్యం చెలాయించారు. అందుకే అతడు 50 ఓవర్ల ఫార్మాట్‌కు సరిపోడు' అని క్రిస్ శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు.

వైభవ్ సూర్యవంశీకి బౌలింగ్‌లో కూడా శిక్షణ.. కోచ్ ఆసక్తికర వ్యాఖ్యలు

భారత యువ సంచలనం వైభవ్ సూర్యవంశీని ఆల్‌రౌండర్‌గా తీర్చిదిద్దేందుకు భారత యాజమాన్యం సిద్ధమైనట్లు తెలుస్తోంది. జింబాబ్వేతో రెండో టీ20కి ముందు బౌలింగ్ కోచ్ సునీల్ జోషి వైభవ్ భవిష్యత్తు గురించి మాట్లాడాడు. జింబాబ్వేతో తొలి టీ20లో 18 బంతుల్లోనే హాఫ్ సెంచరీ చేసి చరిత్ర సృష్టించిన వైభవ్‌పై ప్రశంసల వర్షం కురిపించాడు. ప్రస్తుతం అతడి బ్యాటింగ్‌పైనే పూర్తి దృష్టి పెట్టామని, అవకాశం వస్తే బౌలింగ్‌లో కూడా శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపాడు.'ముందుగా వైభవ్ బ్యాటింగ్‌ను మెచ్చుకోవాలి. అతడు అద్భుతంగా ఆడుతున్నాడు. అండర్ 19 ప్రపంచ కప్ ఫైనల్స్ నుంచి ఈ మైదానం అతడికి బాగా కలిసొచ్చింది. ప్రశాంతంగా, సునాయాసంగా పరుగులు సాధిస్తున్నాడు. బెంగళూరులోని బీసీసీఐ 'సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్' (అనీఇ)లో అతడి బౌలింగ్ స్కిల్స్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తాం. అతడు బౌలింగ్‌లోనూ కుదురుకుంటే జట్టుకు మరింత ప్రయోజనకరంగా మారుతాడు' అని సునీల్ జోషి తెలిపాడు.



సూర్యాంశ్ షెడ్గేపై ఒత్తిడి వద్దుయువ సీమ్ ఆల్‌రౌండర్ సూర్యాంశ్ షెడ్గేను హార్దిక్ పాండ్యా, శివమ్ దూబేలతో పోల్చడం సరికాదని జోషి స్పష్టం చేశాడు. 'అంతర్జాతీయ స్థాయికి అలవాటు పడేందుకు యువ ఆటగాళ్లకు కొంత సమయం పడుతుంది. సూర్యాంశ్ ఇప్పుడిప్పుడే భారత జట్టులో తన స్థానాన్ని స్థిరపరుచుకుంటున్నాడు. అతడిలోని ప్రతిభను నమ్మి అవకాశాలు ఇవ్వాల్సిన అవసరం ఉంది. అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, హర్ష్ దూబె వంటి ప్లేయర్లకు బౌలింగ్ చేసే సామర్థ్యం ఉంది. ధారాళంగా పరుగులు ఇవ్వకుండా నియంత్రణతో బౌలింగ్‌లో చేసేలా వారితో నిరంతరం చర్చిస్తున్నాం' అని జోషి వెల్లడించాడు.

మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్ డిమాండ్. లీకేజీలను నిరసిస్తూ విద్యార్థులతో కలిసి కాంగ్రెస్ ర్యాలీ. న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచీ ఇందిరా పార్క్ వరకు ప్రదర్శన.



ధర్నా చౌక్ వెళ్ళకుండా అడ్డుకున్న పోలీసులు. అంజన్ సహా కాంగ్రెస్ నేతల అరెస్టులు. నీట్ పరీక్షల లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే తన పదవికి రాజీనామా చేయాలని మాజీ ఎంపీ, టీపీసీసీ కార్యనిర్వహక అధ్యక్షుడు మందడి అంజన్ కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. డిల్లీలో విద్యార్థులు చేస్తున్న దీక్షలకు మద్దతుగా శుక్రవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. యువజన కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరవింద్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్ నుంచి లిబర్టీ చౌరస్తా మీదుగా ఇందిరా పార్క్ వరకు బారీ ర్యాలీ సాగింది. పెద్ద సంఖ్యలో విద్యార్థులతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలసి అంజన్ కుమార్ యాదవ్ ఈ నిరసనలో పాల్గొన్నారు. అయితే ఇందిరా పార్క్ చౌరస్తా వద్ద వీరిని అడ్డుకున్న పోలీసులు ధర్నా చౌక్ వైపు వెళ్లడానికి అనుమతించలేదు. దీంతో మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, అరవింద్ యాదవ్ లు పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ధర్నా చౌక్ వెళ్ళకుండా అడ్డుకున్న పోలీసులు అంజన్ సహ పార్టీ నాయకులను బలవంతంగా అరెస్టు చేసి వాహనాల్లో తరలించారు. ఈ సందర్భంగా అంజన్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ పాలకులు విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని ఆరోపించారు. పరీక్ష పేపర్లు అంగడి సరుకుగా మారాయని, యువత జీవితాలతో చెలగాటం ఆడటం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. వెంటనే కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని, ఆత్మహత్యలు చేసుకున్న విద్యార్థుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

ఇండియన్ ఆయిల్ ఎల్పీజీ సిలిండర్ల 'ఎక్స్‌ప్రెస్ డెలివరీ' ప్రారంభం

- నాలుగు గంటల్లోనే 10, 5 కిలోల సిలిండర్ల డెలివరీ



హైదరాబాద్, జూలై 25, 2026: వినియోగదారులకు వేగవంతమైన సేవలు అందించేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ శ్రీకారం చుట్టింది. బుక్ చేసిన నాలుగు గంటల్లోనే డెలివరీ అయ్యేలా పది కిలోల కాంపోజిట్ 'ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నౌ', ఐదు కిలోల 'ఛోటూ' సిలిండర్ల 'ఎక్స్‌ప్రెస్ డెలివరీ' సేవలను ఇండియన్ ఆయిల్ ఛైర్మన్ ఏఎన్ సాహ్నీ పుణేలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నౌ' వినియోగదారులకు మరింత స్మార్ట్, సురక్షితమైన, అనుకూలమైన ఎల్పీజీ అనుభవాన్ని అందిస్తుందన్నారు. వినియోగదారుల సేవల్లో నూతన ప్రమాణాలను నెలకొల్పుతూ భవిష్యత్ అవసరాలకు తగ్గ ఇంధన పరిష్కారాలను అందించడంలో ఇండియన్ ఆయిల్ కట్టుబడి ఉందనడానికి ఇది నిదర్శనమన్నారు.

ఈ సందర్భంగా ఇండియన్ ఆయిల్ మార్కెటింగ్ డైరెక్టర్ శ్రీ సౌమిత్ర పీ శ్రీవాస్తవ మాట్లాడుతూ వినియోగదారులు వేగవంతమైన, సౌకర్యవంతమైన సేవలను కోరుకుంటున్నారన్నారు. 'ఇండేన్ ఎక్స్‌ట్రాలైట్ నౌ' వినూత్న సాంకేతికతను, నమ్మకమైన డెలివరీతో ఇండియన్ ఆయిల్ వినియోగదారుల ప్రాధాన్యతను చాటి చెప్తుందన్నారు. గృహ ఎల్పీజీ అనుభవాన్ని పునర్నిర్వచించడంలో ఇది మరొక కీలకమైన అడుగు అన్నారు. ఈ సేవలను ప్రాథమికంగా పుణే, గుర్గావ్, ఇండోర్, కోయంబత్తూర్ నగరాల్లో అందుబాటులోకి తెస్తున్నామన్నారు. ఆగస్టు 2026 మధ్య నాటికి మరో 25 నగరాలకు, అక్టోబర్ 2026 చివరి నాటికి దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు ఈ సేవలు అందుబాటులోకి వస్తాయన్నారు. వినియోగదారులు ఇండియన్ ఆయిల్ వన్ యాప్, వెబ్‌సైట్ (హ్ట్టిజూం://ఖఇ.అఅఎఱుఅశీఅశ్రీ.అఅ) ద్వారా కొత్త కనెక్షన్ల కోసం నమోదు చేసుకోవచ్చన్నారు. త్వరలోనే వాట్సాప్ (7588888824) బుకింగ్ సదుపాయం కూడా అందుబాటులోకి రానుందన్నారు.

భక్తిశ్రద్ధలతో శ్రీమన్నారాయణ హోమం

-ప్రారంభమైన గురుపౌర్ణమి ఉత్సవాలు
-గురు చరిత్ర పారాయణంలో భక్తులు



జహీరాబాద్ జూలై 25: జిల్లాలో ఆధ్యాత్మిక కేంద్రంగా విరాజిల్లుతున్న బర్దిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ఈ నెల 29న జరగనున్న వ్యాసపౌర్ణమి ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక ఆధ్యాత్మిక కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రతిరోజూ గణపతి పూజ, గోపూజ, గురు చరిత్ర పారాయణం నిర్వహిస్తున్నారు. శనివారం తొలి ఏకాదశి సందర్భంగా ఆశ్రమంలో వైభవంగా శ్రీమన్నారాయణ హోమం నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవాచనం, కలశ స్థాపన, నవగ్రహ పూజ, అగ్ని ప్రతిష్ఠ, సంకల్పం తదితర కార్యక్రమాలను వేద మంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం యజ్ఞగుండంలో నెయ్యి సమిధలు, నవధాన్యాలు, ఔషధ ద్రవ్యాలను సమర్పిస్తూ "ఓం నమో నారాయణాయ" మంత్రోచ్ఛారణల మధ్య శ్రీమన్నారాయణ హోమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు.అనంతరం ఆశ్రమ పీఠాధిపతులు శ్రీశ్రీశ్రీ 1008 వైరాగ్య శిఖామణి అవధూత గిరి మహారాజ్, మహామండలేశ్వర్ డాక్టర్ సిద్ధేశ్వరానందగిరి మహారాజ్ ఆధ్వర్యంలో వేద పాఠశాల విద్యార్థుల వేదఘోషలు, మంగళ వాయిద్యాల నడుమ పూర్ణాహుతి ఘనంగా నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఆనందగిరి స్వామి, నందినిగిరి స్వామి, అర్చకులు శ్రీపాద్ స్వామి, నాగేంద్రయ్య స్వామి, వేద పాఠశాల విద్యార్థులు, ఆశ్రమ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రజాగ్రహానికి ఎవరైనా తల వంచాల్సిందే

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా విద్యార్థుల ఉద్యమం ఫలితమే ....
కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం సంపూర్ణంగా విద్యార్థుల విజయం.
- మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి



తెలంగాణ పవర్ నాగర్ కర్నూల్ జిల్లా ప్రతినిధి (జూలై 25): నీట్ ప్రశ్నా పత్రాల లీకేజి విషయంలో కేంద్ర ప్రభుత్వ విద్యాశాఖ వైఫల్యం స్పష్టంగా ఉంది.

ఈ విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, యువకులు, విద్యావేత్తలు ఎంతగా కోరినా కేంద్రం పెడచెవిన పెట్టడం వల్ల పరిస్థితి చేయి దాటింది.

వాంగ్ చుక్ దీక్ష విషయంలో, కాక్రోచ్ జనతాపార్టీ ఆందోళన విషయంలో కేంద్ర ప్రభుత్వం అనుసరించిన వైఖరి ఏమాత్రం సమంజసంగా లేదు.

విద్యార్థుల మీద అమానుషంగా ప్రవర్తించడం ప్రతీ భారతీయుడ్ని కదిలించింది.

అందుకే యావత్ దేశం మోడీ ప్రభుత్వం మీద తిరగబడే పరిస్థితి వచ్చింది.

ప్రజాగ్రహాన్ని గ్రహించే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాల్సి వచ్చింది. ఇదే రాజీనామా ఓ నెల రోజుల ముందు చేసి ఉంటే, ప్రధాని మోడీ ప్రతిష్ట మరింత పెరిగేది.

అనేక మంది రైతులు మరణించిన తర్వాత సాగు చట్టాలను రద్దు చేసినట్లే, అనేక మంది విద్యార్థులు నష్టపోయిన తర్వాత ధర్మేంద్రతో రాజీనామా చేయించడం మోడీ చేతులు కాలాక ఆకులు పట్టుకున్నట్లయింది.

నీట్ లాంటి జాతీయ పరీక్షల విషయంలో కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా మరింత బాధ్యతగా వ్యవహరిస్తుందని ఆశిస్తున్నాను.

డిజిటల్ విధానంలో పరీక్షలు పెట్టాలని డిమాండ్ చేస్తున్నాను.

విద్యార్థుల ఆందోళనను రాజకీయం చేయవద్దని బిఆర్ఎస్ తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయం అత్యంత రాజకీయ పరిణితితో కూడుకున్నది.

విద్యార్థులు చేస్తున్న ఉద్యమాన్ని రాజకీయ పార్టీలు హైజాక్ చేయడం వల్ల సమస్య పక్కదారి పడుతుందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ గారు స్పష్టం చేశారు. కానీ ఉద్యమానికి మద్దతుగా నిలిచారు.

విద్యార్థుల ఆందోళన నేపథ్యంలో ప్రభుత్వంలో ఉన్న వారు తామే అధికులమని గ్రహించే వైఖరిని ఇప్పటికైనా విడనాడాలి.

హామీల అమలు విషయంతో పాటు, అనేక విషయాల్లో వైఫల్యం చెందిన రాష్ట్ర ప్రభుత్వం కూడా తాజా రాజకీయ పరిణామాలతో అప్రమత్తం కావాల్సిన అవసరం ఉంది అని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి గారు ఒక ప్రకటనలో తెలిపారు

ఆచార్య కళాశాలలో నషా ముక్త్ ఫర్ వికసిత్ భారత్



జహీరాబాద్ జూలై 25: కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ మై భారత్ ఆధ్వర్యంలో నషాముక్త్ యువ ఫర్ వికసిద్భారత్ కార్యక్రమంలో భాగంగా యువతలో విస్తృత అవగాహన కార్యక్రమాలు ఊపందుకున్నాయి. నోటు డ్రగ్స్ ఎస్ టు లైఫ్ అనే ప్రధాన నినాదంతో 15 నుండి 29 సంవత్సరాల యువతను భాగ్యస్వామ్యం చేస్తూ ఈ జాతీయ ప్రచారాని చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ లోని ఆచార్య డిగ్రీ కళాశాలలో నిర్వహించిన పోటీలలో కళాశాల విద్యార్థులు అత్యంత ఉత్సాహంగా పాల్గొన్నారు. సంగీతం, జానపద గీతాలు, నృత్యం,నొక్కడినాటక్, మైమ్ చిత్రలేఖనం, డిబేట్, షార్ట్ ఫిలిం వంటి ఎనిమిది విభాగాలలో పోటీలు నిర్వహించారు.జూలై 28 నుండి ఆగస్టు 5 వరకు రాష్ట్రస్థాయి పోటీలు మరియు నదస్సులు ఉంటాయని వివరించారు. ఆగస్టు 2న ప్రధానమంత్రి ప్రసంగం మరియు జాతీయ ప్రతిజ్ఞ,14న న్యూఢిల్లీలో జాతీయ నషముయువజన సదస్సు కార్యక్రమంలో భాగంగా నిర్వహించే స్పోకెన్ వర్డ్ ప్రదర్శనలు చైతన్య కార్యక్రమాలు విద్యార్థులలో ఆలోచనను చైతన్యాన్ని నింపుతాయని, డ్రగ్స్ రహిత వికసిద్భారత్ నిర్మాణంలో ప్రతి ఒక్కరు భాగ్యసములు కావాలని ఈ సందర్భంగా మై భారత్ ఉమ్మడి మెదక్ జిల్లా యువజన అధికారి ఎం రంజిత్ రెడ్డి పిలుపునిచ్చారు ఈ కార్యక్రమంలో కార్యక్రమాల అధికారి కిరణ్ కుమార్ విజేతలుగా నిలిచిన 24 మంది విద్యార్థులకు బహుమతులను ప్రధానం చేశారు. పెయింటింగ్ విభాగంలో విష్ణువర్ధన్, స్లోగన్ రైటింగ్ లో వరుణ్ తేజ శివాని అండ్ ,షార్ట్ ఫిలిం రిలీజ్ లో కరణ్ ,నాటక విభాగంలో శృతి ,డ్యాన్స్ విభాగంలో నవ్య, ఫోక్ సాంగ్స్ భాగంలో సంధ్య, డిబేట్ మరియు స్పీచెస్ విభాగంలో సిఫాసుల్తానా, స్నేహలకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చింతల హరికుమార్,కళాశాల డైరెక్టర్ జి.శ్రీనివాస్ రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు నందు గౌడ్, దీపిక దత్తు, జూరీ మెంబర్స్ విజయ్ కుమార్, రాజు గౌడ్, అధ్యాపకులు నర్సింలు, లావణ్య, నవనీత, ఆయేషా, నవీన, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి.

అధికారులు నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు - ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి జూలై 25 తెలంగాణ పవర్ : ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో వేగవంతంగా అమలు చేయాలని, ప్రతి అధికారి ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని క్యాంపు కార్యాలయంలో మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. సుమారు రెండు గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారం, శాఖల మధ్య సమన్వయం, మెరుగైన సేవలందించే దిశగా ఆయన అధికారులకు కీలక దిశానిర్దేశం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం

రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎంపీడీవో అధికారుల పనితీరుపై సమీక్షించిన ఎమ్మెల్యే.. ప్రజల నుంచి వచ్చే భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడంతో పాటు గ్రామాభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా లబ్ధిదారులకు సకాలంలో అందేలా పౌర సరఫరాల శాఖ పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు.

రైతులకు అండగా అధికారులు నిలవాలి అన్నారు

ప్రత్యామ్నాయ సాగుపై అవగాహన కల్పించాలి

వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖల అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తక్కువ వర్షపాతం నమోదవుతున్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు, డ్రిప్, స్ప్రింక్లర్ తదితర ఆధునిక సాగు విధానాలను ప్రోత్సహించాలన్నారు. చెరువులు, కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, సాగునీటి పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల మరమ్మతులను తక్షణమే పూర్తి చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పశువులకు ఉచిత వైద్య శిబిరాలు, మత్స్యకారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, అలాగే అటవీ సంపదను కాపాడుతూ అక్రమ కలప రవాణాను అరికట్టాలని అటవీ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు.

విద్య, వైద్యం, తాగునీటి సరఫరాలో రాజీపడొద్దు

మౌలిక సదుపాయాలు, విద్య, వైద్య రంగాలపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ ద్వారా ప్రతి గ్రామానికి నిరంతర తాగునీరు అందించాలని, పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా చేరాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు.

ఎస్ఐఆర్' నమోదును వేగవంతం చేయాలి

మణుగూరు మండలంలో అమలవుతున్న 'ఎస్ఐఆర్' నమోదు ప్రక్రియ పురోగతిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ నమోదు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ఏ ఒక్క శాఖ నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని, అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగి ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీవోతో పాటు సింగరేణి సమన్వయ అధికారులు, తదితర అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు

కథా సుబ్బారం సాహిత్య వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన "అవిష్కరణ సభ"



హైదరాబాద్, జూలై 25: తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో, పాలపిట్ట మాసపత్రిక సంయుక్త ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత్రి శ్రీమతి నెల్లుట్ల రమాదేవి, డాక్టర్ కొండపల్లి నీహారిణి రచించిన పుస్తకాల ఆవిష్కరణ సభ శనివారం రవీంద్రభారతి మినీ హాల్‌లో ఘనంగా జరిగింది. సాహిత్యాభిమానులు, రచయితలు, కవులు, విమర్శకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి (ఐఏఎస్) హాజరై వున్నతకాలను ఆవిష్కరించారు. సాహిత్యం సమాజానికి దిశానిర్దేశం చేసే శక్తిగా నిలుస్తుందని, మంచి రచనలు తరతరాలకు మార్గదర్శకంగా ఉంటాయని ఆయన పేర్కొన్నారు.

ఈ సందర్భంగా డాక్టర్ కామేశ్వరి కథలపై ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ ముదిగంటి సుజాతారెడ్డి సమగ్ర విశ్లేషణ చేశారు. రచయిత్రి డాక్టర్ కొండపల్లి నీహారిణి రచించిన "కథా సుబ్బారం" గ్రంథాన్ని ఆవిష్కరించగా, శ్రీమతి నెల్లుట్ల రమాదేవి రచించిన "అభిమాననం" గ్రంథాన్ని సాహిత్య ప్రముఖులు ఆవిష్కరించారు.

కార్యక్రమంలో డాక్టర్ అప్పాజ్యోతుల శ్రీలత సుభద్రాదేవి, డాక్టర్ వాడ్రేవు వీరలక్ష్మి (కథా సుబ్బారం), శ్రీమతి సింగరాజు రమాదేవి, శ్రీమతి అరుణ ధూపాటిశెట్టి, శ్రీమతి రాధికాసూరి, శ్రీమతి పద్మశ్రీ చెన్నోజ్జలతో పాటు పలువురు ప్రముఖ రచయితలు, కవులు, సాహితీవేత్తలు పాల్గొని పుస్తకాల విశిష్టత, రచయితల సాహిత్య సేవలను కొనియాడారు.

వక్తలు మాట్లాడుతూ తెలుగు సాహిత్యాభివృద్ధికి ఇటువంటి పుస్తక ఆవిష్కరణ సభలు ఎంతో దోహదపడతాయని, కొత్త రచయితలకు ఇవి స్ఫూర్తిదాయక వేదికలుగా నిలుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమం చివరలో నిర్వాహకులు పాల్గొన్న అతిథులు, సాహిత్యాభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

సినిమా

ఇన్‌స్టాలో దుమ్మురేపిన ఫౌజీ

ఫస్ట్‌లుక్ విడుదల కాగానే 5.33 లక్షల లైక్స్



రెబల్ స్టార్ ప్రభాస్ సినిమా అంటే థియేటర్లలో మాత్రమే కాదు, సోషల్ మీడియాలోనూ అభిమానుల సందడి ఏ స్థాయిలో ఉంటుందో మరోసారి నిరూపితమైంది. తాజాగా విడుదలైన ఫౌజీ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్ ఇన్‌స్టాగ్రామ్‌లో అరుదైన రికార్డును నమోదు చేసి, భారతీయ సినీ ప్రమోషన్లకు కొత్త బెంచ్‌మార్క్‌ను సెట్ చేసింది. తాజా గణాంకాల ప్రకారం, 'ఫౌజీ' ఫస్ట్ లుక్ పోస్టర్ విడుదలైన తొలి 24 గంటల్లోనే ఏకంగా 5.33 లక్షల షేర్లు సాధించింది. దీంతో ఇన్‌స్టాగ్రామ్‌లో అత్యధికంగా షేర్ చేయబడిన సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్‌గా ఇది కొత్త రికార్డును సృష్టించింది. అభిమానులు ఈ పోస్టర్‌ను భారీ స్థాయిలో షేర్ చేస్తూ సోషల్ మీడియాలో ఒక డిజిటల్ వేడుకలా మార్చేశారు. ఈ రికార్డు ప్రభాస్ డిజిటల్ క్రేజ్‌కు మరో నిదర్శనంగా మారింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈసారి ప్రభాస్ మరో హీరో రికార్డును కాదు, తన సొంత రికార్డునే బద్దలు కొట్టారు. గతంలో 'స్పిరిట్' ఫస్ట్ లుక్ పోస్టర్ 5.19 లక్షల షేర్లతో అగ్రస్థానంలో ఉండగా, ఇప్పుడు 'ఫౌజీ' దానిని అధిగమించి మొదటి స్థానాన్ని కైవసం చేసుకుంది. దీంతో సోషల్ మీడియాలో ప్రభాస్ ఆధిపత్యం మరింత బలపడిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ పోస్టర్ అభిమానులను అంతగా ఆకట్టుకోవడానికి ప్రధాన కారణం అందులో కనిపించిన ప్రభాస్ లుక్. ఒక వార్ ÷ట్ లో గాయాలతో కూర్చుని ఉన్న ఆ రూపం చాలా క్రేజీగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ చిత్రానికి సంబంధించిన ప్రతి అప్‌డేట్‌కు సోషల్ మీడియాలో అద్భుతమైన స్పందన లభిస్తోంది. ఫస్ట్ లుక్‌తో వచ్చిన ఈ రికార్డు సినిమా చుట్టూ ఉన్న హైప్‌ను మరింత పెంచింది. ప్రభాస్ అభిమానులతో పాటు, సినీ ప్రేక్షకులు కూడా ఈ సినిమాపై భారీ అంచనాలు పెట్టుకున్నారు. హను రాఘవపూడి దర్శకత్వంలో రూపొందుతున్న ఈ పీరియడ్ వార్ డ్రామాను మైత్రి మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ప్రభాస్ పవర్‌ఫుల్ రోల్ లో తెరకెక్కుతున్న ఈ మూవీ డిసెంబర్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. విడుదలకు ఇంకా సమయం ఉన్నప్పటికీ, సోషల్ మీడియాలో ఇప్పటికే 'ఫౌజీ' సృష్టిస్తున్న సంచలనం చూస్తుంటే, ఈ సినిమా కోసం అభిమానులు ఎంత ఆసక్తిగా ఎదురుచూస్తున్నారో స్పష్టంగా తెలుస్తోంది.

రామ్‌చరణ్-సుకుమార్ కాంబో

ఆర్‌సి17 పట్టాలకెక్కనుందని ప్రచారం





ఈ ఏడాది పెద్ది సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్టందుకున్న రాంచరణ్ మరోమారు సుకుమార్‌తో సినిమాకు సిద్ధం అవుతున్నారు. వీరి కాంబో రంగస్థలం బాక్సాఫీస్‌ను షేక్ చేసిందని తెలిసిందే. ఈ ఇద్దరి క్రేజీ కాంబోలో మరోసారి ఆర్‌సీ 17సందడి చేసేందుకు రెడీ అవుతోంది. మూవీ లవర్స్‌తోపాటు అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న అప్‌డేట్ ఒకటి నెట్టింట వైరల్ అవుతోంది. తాజా టాక్ ప్రకారం ఆర్‌సీ17 మూవీ ఫైనల్ స్క్రిప్ట్ పూర్తయింది. మేకర్స్ త్వరలోనే గ్రాండ్‌గా ఈ సినిమాను షురూ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారని ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. అన్నీ అనుకున్నట్టు కుదిరితే వచ్చే సెప్టెంబర్‌లోనే సినిమా లాంచ్ కానుందట. అంతేకాదు నవంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలు కానుందని ఇన్‌సైడ్ టాక్. రంగస్థలం తర్వాత సుకుమార్-రాంచరణ్ కాంబోలో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీగానే ఉన్నాయి. ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. నటీనటులు, ఇతర సాంకేతిక నిపుణుల వివరాలపై త్వరలోనే మేకర్స్ క్లారిటీ ఇవ్వనున్నారు. ఈ చిత్రానికి రాక్‌స్టార్ దేవీ శ్రీ ప్రసాద్ మ్యూజిక్ బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నాడని వార్తలు రాగా.. మరోవైపు ధురంధర్ శశ్వత్ సచ్‌దేవ్ పేరు కూడా తెరపైకి వచ్చింది. రాంచరణ్ నిర్మాతగా నిఖిల్ హీరోగా నటిస్తోన్న ఇండియా హౌస్ చిత్రానికి కూడా శశ్వత్ సచ్‌దేవ్ సంగీతం అందిస్తున్నాడు.

ప్రియాంకచోప్రా బర్త్‌డే

విషెస్ చెబుతూ వారణాసి లుక్ విడుదల

మహేశ్ బాబు కథానాయకుడిగా రాజమౌళి దర్శకత్వంలో రానున్న చిత్రం 'వారణాసి'లో మహేశ్‌కు జోడీగా బాలీవుడ్ నటి ప్రియాంక కనిపించనున్న విషయం తెలిసిందే. మందాకిని పాత్రలో ఆమె సందడి చేయనున్నారు. శనివారం ఆమె పుట్టినరోజు సందర్భంగా సినిమా సెట్‌లోని ఫొటోలను విడుదల చేస్తూ రాజమౌళి పోస్ట్ పెట్టారు. 'ఆమె నవ్వితే అందం.. నవ్వకపోతే నిప్పు కణిక' అనే క్యాప్షన్ పెట్టారు. ప్రస్తుతం ఈ ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మహేశ్ కూడా ప్రియాంకకు విషెస్ చెప్పారు. 'మా ఒకే ఒక్క మందాకినికి హ్యాపీ బర్త్‌డే..' అని పోస్ట్ పెట్టారు. ప్రియాంక 'వారణాసి' కోసం 14 నెలల నుంచి షూటింగ్‌లో పాల్గొంటున్నారు. ఇందులో అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చేసినట్లు ఆమె చెప్పారు. ఇక ఈ చిత్రంలో రుద్ర, శ్రీరాముడిగా మహేశ్ ద్విపాత్రాభినయం చేస్తున్నారు. ప్రపంచంతో పాటు కాలాల్ని చుట్టేసే సాహసికుడి కథగా ఇది ముస్తాబవుతున్నట్లు తెలిసిందే. భారీ బడ్జెట్‌తో పాన్ ఇండియా స్థాయిలో రానున్న ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 7న విడుదల కానుంది. ఈ ఏడాది అక్టోబర్ నాటికి చిత్రీకరణ పూర్తి చేసి ప్రచారాన్ని ప్రారంభించనున్నారు. ప్రియాంక చోప్రా ఫొటోస్ రిలీజ్ నేపథ్యంలో సోషల్ మీడియాలో మరోసారి ఆసక్తికర ప్రచారం మొదలైంది. మహేశ్ బాబు పుట్టినరోజు సందర్భంగా ఆగస్టు 9న వారణాసి తొలి గ్లింప్స్‌ను విడుదల చేయనున్నట్లు అభిమానులు, ఫ్యాన్ పేజీలు పెద్ద ఎత్తున పోస్టులు చేస్తూ హల్‌చల్ చేస్తున్నాయి. 'బాబు బర్త్‌డేకు భారీ సర్‌ప్రైజ్', 'బాబు బర్త్‌డేకు గ్లింప్స్ లోడింగ్'. 'ఆగస్టు 9న ఇంతకుముందెన్నడూ చూడని హైప్ చూడబోతున్నారు'



మరోమారు వార్తల్లోకి నటి నమిత

స్లిమ్‌గా మారిన ఫోటోలతో నెటిజన్ల ఆసక్తి

ఒకప్పుడు టాలీవుడ్, కోలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరించిన నమిత ఇప్పుడు మరోసారి వార్తల్లో నిలిచారు. పెళ్లి తర్వాత సినిమాలకు దూరంగా ఉంటూ కుటుంబ జీవితంలో బిజీగా గడుపుతున్న ఆమె.. తాజాగా తన ఫిట్‌నెస్ ట్రాన్స్‌ఫర్మేషన్‌తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు.ఒకప్పుడు బొద్దుగా కనిపించిన నమిత.. ఇప్పుడు పూర్తిగా స్లిమ్‌గా మారి అభిమానులను ఆశ్చర్యపరుస్తున్నారు. జిమ్‌లో కఠినంగా వర్కౌట్స్ చేస్తున్న వీడియోను ఆమె తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో షేర్ చేశారు. మీ మనసు ఏదైతే నమ్ముతుందో.. మీ శరీరం దానినే అనుసరిస్తుంది అనే సందేశాన్ని కూడా ఆ వీడియోకు జత చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో అభిమానులు, నెటిజన్లు వరుసగా కామెంట్లు చేస్తున్నారు. ఇంత స్లిమ్‌గా మారారు ఏంటి?, నిజంగా ఇది నమితేనా?, స్టైలిష్ లుక్ అదిరిపోయింది అంటూ ప్రశంసలు కురిపిస్తున్నారు. చాలా మంది ఆమె కొత్త లుక్‌ను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. నమిత సినీ ప్రయాణాన్ని పరిశీలిస్తే.. కన్నడ, తమిళ, తెలుగు, హిందీ భాషల్లో పలు చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. తెలుగులో 'సొంతం' సినిమాతో ఎంట్రీ ఇచ్చిన ఆమె.. 'ఒక రాజు ఒక రాణి', 'ఓ రాధ ఇద్దరు కృష్ణుల పెళ్లి', 'బిల్లా', 'నాయకుడు', 'సింహా', 'మన్యం పులి' వంటి చిత్రాల్లో నటించారు. ముఖ్యంగా బాలకృష్ణ నటించిన 'సింహా' సినిమాలో ఆమె గ్లామర్, నటన ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. పెళ్లి అనంతరం సినిమాలకు విరామం ఇచ్చిన నమిత గత కొన్నేళ్లుగా పూర్తిగా కుటుంబ జీవితానికే ప్రాధాన్యం ఇస్తున్నారు. అయితే తాజాగా ఆమె ఫిట్‌నెస్‌పై దృష్టి పెట్టి సరికొత్త లుక్‌లో కనిపించడంతో.. త్వరలోనే మళ్లీ వెండితెరపై రీఎంట్రీ ఇవ్వబోతున్నారా? అనే చర్చ సినీ వర్గాల్లో మొదలైంది. అయితే దీనిపై నమిత నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.



Edited, Printed, Published and Owned by NASREEN KHAN , Printed at M/s DATTASAI GRAPHICS :1-1-651/8, Gandhi Nagar, Hyderabad-500 080
Published from H.No.1-7-137, Flat 402, Vijaysai Apartments, Zamistanpur, Musheerabad, Hyderabad- 20, (Telangana) Editor:Nasreen Khan, Ph : 040-27602786, Cell : 965243981 .R.N.I.No.TELTEL/2013/51844